
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

మంగళవారం 9 డిసెంబరు 2025





వైభవంగా యువజనోత్సవం

- కళాకారులతో ఏఎన్‌యూ కళకళ
- విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలి: వీసీ

6




మణిపూర్ విద్యార్థినుల నృత్యాలు

రూపాయి ప్లాన్.. పనిచేసింది

- నయా ఆఫర్లతో ఆకట్టుకుంటున్న బీఎస్ఎన్ఎల్
- రూపాయి ప్లాన్‌తో ప్రజల చెంతకు
- ఆఫర్ నెలాఖరు వరకు పొడిగింపు..

6





- కోర్ కేపిటల్ ఏరియాలో జరుగుతున్న పనులు

అమరావతి జిగేల్ జిగేల్

6

- అబ్బురపరుస్తున్న రాజధాని నైట్ వ్యూ

అమ్మ ఫోను పిల్లలకు చేటు



- గర్భిణులు ఫోన్ వాడితే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్..!
- గుంటూరులో వెలుగు చూసిన రెండు కేసులు
- అరుదైన శస్త్రచికిత్సతో ట్యూమర్ల తొలగింపు
- కిమ్స్ న్యూరో సర్జరీ వైద్యనిపుణుల ఘనత

6

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం

6



పోలీసు పుత్రుడు

ఐదుగురు విద్యార్థులను బలితీసుకున్న..చోర్ గ్యాంగ్

- హైవేలో కారు ప్రమాదానికి కారకుడు
- గ్యాంగ్‌లీడర్ నరసరావుపేటలోని పోలీసు అధికారి పుత్రరత్నం
- తండ్రి రక్షణ, పోలీసుల అండతో 'మద'మెక్కి నేరాలు
- చిలకలూరిపేట పోలీసుల అదుపులో నిందితులు
- విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి..
- రంగంలోకి దిగిన ఐజీ త్రిపాఠి.. ఎస్పీ కృష్ణారావు

ఓ పోలీసు అధికారి పుత్ర వాత్సల్యం.. వారసుడు నేరాల బాట పట్టినా వారించలేక పోయింది. పుత్రుడి దందాలకు ఛత్రం వలే రక్షణగా నిలవడంతో.. ఆ పాపం నేడు ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రాణాలను హరించింది. అక్రమార్జన కోసం ఆ అధికారి తనయుడు హైవేపై ట్రాలీని ఆపడానికి చేసిన కనుసైగ.. దాదాపు అతని వయస్సున్న నిండు జీవితాలను బలితీసుకుంది. చిలకలూరిపేట బైపాస్‌లో ఇటీవల చోటు చేసుకున్న కారు ప్రమాదం వెనుక.. మరో నలుగురితో కలిసి ఖాకీ కొడుకు చేసిన నిర్వాకం సీసీ కెమెరాకు చిక్కింది. చివరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు విద్యార్థుల మృతికి కారకులైన ఈ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గ్యాంగ్‌లోని ఐదుగురు యువకుల విచారణలో విస్తుపోయే నిజాలు పోలీసులకు తెలిశాయి. హైవేలో రవాణా శాఖ అధికారులమంటూ.. వారు చేసిన దందా మచ్చుతునకేనని.. అసలు వారి నేర సామ్రాజ్యం ఇంకా ఉందని.. దానికి పోలీసులు కూడా వంత పాడారని తేలింది.



చిలకలూరిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్‌లో కారు ప్రమాదానికి సంబంధించిన సీసీ ఫుటేజీ బయటకు రావడంతో నరసరావుపేట గ్యాంగ్ దందా బట్టబయలైంది. మొదట రవాణశాఖ అధికారులు ట్రాలీని రోడ్డులో నిలపడం వల్లే.. కారు లారీని ఢీకొన్నదన్న ప్రచారం జరిగింది. దీంతో అప్రమత్తమైన రవాణ శాఖ అధికారులు హైవేలో ఉన్న అన్ని సీసీ కెమె రాల్లోని ఫుటేజీని (మిగతా 6వ పేజీలో)

సంక్షేమంపై ఏఐ

సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు హెచ్‌పీటీఎస్ యాప్..

- ఏఐ సాయంతో లోపాలపై ఉన్నతాధికారులకు సమాచారం
- ఉదయం స్టడీ అవర్స్ నుంచి నిత్య పరిశీలన



ఉదయం స్టడీ అవర్స్‌ను పర్యవేక్షిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్

గుంటూరు(విద్య) డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించే వెల్ఫేర్ ఆఫీసర్ల పనితీరుకు చెక్ పెట్టడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా కృత్రిమ మేధ(ఆర్టిఫియల్ ఇంటిలిజెన్స్) సహకారంతో.. హాస్టల్ పెర్ఫామెన్స్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కృత్రిమ మేధ సహకారంతో పనిచేసే ఈ యాప్ ద్వారా ప్రతి హాస్టల్లో క్షేత్రస్థాయిలో (మిగతా 6వ పేజీలో)

అటకెక్కిన పర్యవేక్షణ

- కళాశాల వసతి గృహాల్లో ప్రైవేటు వ్యక్తుల ఆగడాలు

గుంటూరు(విద్య) డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలో సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలల హాస్టల్స్‌లో ప్రైవేటు వ్యక్తుల దందా శృతి మించుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని వసతిగృహాల్లో వంట, శానిటేషన్ విధుల్లో ప్రైవేటు సిబ్బందిని పెట్టుకొని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి ఈ ప్రైవేటు వ్యక్తుల ఆగడాలు శృతిమించి విద్యార్థులపై దాడులు చేసే స్థాయికి వస్తున్నట్లు విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నగరంపాలెంలోని హయ్యర్ హాల్ ప్రాంగణంలో (రమేష్ హాస్పిటల్ పక్కన) రెండు కళాశాల వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో ఓ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థి ఇటీవల అదృశ్యం అయ్యాడు. ఈ విద్యార్థి జన్యు పరమైన లోపంతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ట్రాన్స్ జెండర్స్ పంచన చేరి

- ప్రశ్నించిన విద్యార్థులపై దురుసు ప్రవర్తన
- ట్రాన్స్ జెండర్ పంచన చేరిన ఓ హాస్టల్ విద్యార్థి
- సెలవుల్లో క్యాటరింగ్ పనులకు విద్యార్థులు
- పోలీస్‌స్టేషన్ వరకు చేరుతున్న పంచాయతీలు



కొద్ది రోజులు ఉన్నాడు. దీనికి హాస్టల్‌లో అనధికారంగా పని చేసే ఓ మహిళ సహకారం ఉన్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. చివరకు ఈ విద్యార్థి ఇంటి నుంచే అదృశ్యమైనట్లు తల్లిదండ్రులతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బలవంతంగా ఒప్పించినట్లు సమాచారం.

ఈ హాస్టల్లో భోజనం, సౌకర్యాల విషయంలో విద్యార్థులు ప్రశ్నిస్తే వారిపై ప్రైవేటు వ్యక్తులు, బంధువులు దాడులు చేస్తారని ఆరోపణలు ఉన్నాయి. అనధికారికంగా పని చేసే ఓ మహిళ బంధువులు హాస్టల్లో పెత్తనం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణ రావడంతో ఆయనను ఇటీవల బదిలీ చేశారు. మరో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బదిలీ లేకుండా ఇంకా ఇక్కడే కొనసాగుతున్నట్లు సమాచారం. ఆయన (మిగతా 6వ పేజీలో)

క్యాటరింగ్ విధుల్లో విద్యార్థులు..

ఇటీవల ఇదే కళాశాల హాస్టల్‌ను ఏఎస్‌డబ్ల్యూ ఒకరు సందర్శించారు. విద్యార్థులు బయోమెట్రిక్ హాజరులో 114 మందికి పైగా నమోదు కాగా, వాస్తవంగా అంతమంది లేరని తేలింది. మిగిలిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లారని ఆరా తీయగా.. విద్యార్థుల్లో కొంతమంది క్యాటరింగ్ పనులకు వెళ్తున్నట్లు తేలింది. సెలవు రోజులు, సాయంత్రం పూట బయోమెట్రిక్ హాజరు వేసిన తర్వాత క్యాటరింగ్ పనికి వారు వెళ్తున్నట్లు విచారణలో తేలింది. దీనికి ఇక్కడ పనిచేసే అనధికార మహిళ, సిబ్బంది సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

తేలనున్న గ్రామకంఠాల లెక్క

రాజధానిలో మినహాయిపు గ్రామ కంఠాల సర్వేకు బృందాలు సిద్ధం

తుళ్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజధాని 29 గ్రామాల్లో ప్రధానంగా నెలకొన్న గ్రామ కంఠాల సమస్యకు చెక్ పెట్టటానికి సర్వే బృందాలను సిద్ధం చేశారు. 13 బృందాలు గ్రామ కంఠాలను సర్వే చేసి సీఆర్డీఏకు నివేదిక ఇవ్వనున్నాయి. గ్రామ కంఠాల మినహాయింపులో అవకతవకలు జరిగాయని రైతులు పలుమార్లు సీఆర్డీఏ అధికారులకు విన్నవించారు. సీఎంచంద్రబాబు నాయుడు రైతుల సమస్యలను పరిష్కారానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో త్రీమెన్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో గ్రామ కంఠాల సమస్య పరిష్కారానికి సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ, సర్వేయర్ ఉంటారు. గ్రామ కంఠాల నిర్దేశిత్వంపై త్వరలో వీరికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం క్షేత్రస్థాయిలో బృందాలు గ్రామ కంఠాలపై సర్వే చేసి నివేదిక లిస్తాయి. నివేదికల ప్రకారం గ్రామ కంఠాల మినహాయింపులపై నిర్ణయం తీసుకుంటారు. రాజధాని గ్రామాల్లో రైతులు కోరుకున్నట్లుగా గ్రామ కంఠాలు మినహాయింపులు ఇస్తే.. మొత్తం కలిపి 90 ఎకరాల లోపు ఉంటుంది. దీని కోసం అధికారులు చేస్తున్న రాద్ధాంతం తగదని పలువురు చర్చించుకుంటున్నారు.

సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఆరా

రాజధాని గ్రామం నేలపాడులో గ్రామం కంఠాలపై సీఆర్డీఏ అడిషనల్ కమిషన్ ఎ.భార్గవ తేజ ఆరా తీశారు. విస్తరించి అమలు చేసిన గ్రామ కంఠంలో స్థలాలను ఆయన పరిశీలించారు. సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులతో మాట్లాడారు. 9.2 కింద మినహాయింపులు, గ్రామ భౌగోళిక పరిస్థితిని వివరంగా తెలుసుకున్నారు. గ్రామ కంఠాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సూచనల మేరకు సీఆర్డీఏ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాగ్య రేఖ పాల్గొన్నారు.

నల్ల మచ్చ, జ్వరం ఉంటే.. అప్రమత్తం కావాలి

'స్క్రబ్ టైఫస్'పై కలెక్టర్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ జ్వరాల వల్ల మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖను సమన్వయం చేసుకుంటూ పంచాయతీ, రెవెన్యూ శాఖలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు.. సోమవారం తన కార్యాలయం నుంచి కలెక్టర్ పీహెచ్‌సీ వైద్యులు. మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్న నల్ల మచ్చ శరీరంపై కనిపించి, జ్వరం వచ్చినట్లయితే స్క్రబ్ టైఫస్‌గా అనుమానించాలన్నారు. జ్వరం మూడు రోజుల వరకు తగ్గకుంటే ప్రభుత్వాస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లే వారు రబ్బరుతో తయారు చేసే షూలు ధరిస్తే మంచిదన్నారు. పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, సీపీఓ శేషశ్రీ, జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్ పాల్గొన్నారు.

అంగడిలో ఆధార్ కేంద్రాలు



నగరంలోని ఒక ఇంటర్నెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం

బ్యాంకుల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాల వల్ల ఆయా బ్యాంకుల సర్వీసులు, ఖాతాదారులకు ఇబ్బందులు ఎదురతున్నాయని చెప్పి.. యాజమాన్యాలు వాటిని తొలగించాలని ఆదేశాలిస్తున్నాయి. దీంతో ఆధార్ కేంద్రాల నిర్వాహకులు బ్యాంకుల నుంచి సెంటర్లు అనధికారికంగా తొలగించి.. సమీపంలో ఉన్న ఇంటర్నెట్ సెంటర్ల వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం ప్రతి రోజు బ్యాంకుల వద్దకు వెళ్లి.. అక్కడి జియో ట్యాగింగ్‌తో ల్యాప్‌టాప్ /మొబైల్‌లో లాగిన్ అయి నెట్ సెంటర్‌కు వచ్చి అక్కడ దందాలు మొదలు పెడుతున్నారు. గతంలో బ్యాంకుల వద్ద సెంటర్లు ఉంటే సీసీ టీవీల నిఘా ఉండే ది. ఇప్పుడు నెట్ సెంటర్లలో ఎలాంటి పర్య వేక్షణ లేకపోవడంతో ఆధార్ సర్వీసు కోసం వచ్చే వ్యక్తి అవసరాన్ని బట్టి రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు.

బ్యాంకులు, పోస్టాఫీసుల్లో మాత్రమే ప్రభుత్వ అనుమతి

- విరుద్ధంగా ఇంటర్నెట్ సెంటర్ల వద్ద బోర్డుల ఏర్పాటు
- భారీగా చార్జీల వసూళ్లు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల ఎలాంటి అనుమతి లేకుండా ఆధార్ నమోదు కేంద్రాలను ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు ఏర్పాటు చేసి, వివిధ సర్వీసులకు రూ. వేలల్లో వసూళ్లు చేస్తున్నారు. ముఖ్యంగా పుట్టిన తేదీ మార్పు కోసం అయితే రూ.5 వేల వరకు కలెక్షన్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ-ఆధార్ సర్వీసు సెంటర్లను కేవలం బ్యాంకులు, పోస్టాఫీసులకు మాత్రమే మంజూరు చేసింది. అలానే అప్పుడప్పుడు గ్రామ/వార్డు సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తోంది. గుంటూరు సర్వజన ఆస్పత్రిలో పుట్టిన బిడ్డలకు అక్కడే ఆధార్ నమోదు చేసే అవకాశం కల్పించింది. అయితే అందరిని ఆశ్చర్యపరిచే విధంగా ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు ఈ-ఆధార్ సర్వీసులను అందిస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టకపోవడం పలు అవినీతి ఆరోపణలకు దారితీస్తోంది.

సాధారణ ఆధార్ సేవలు ఇలా..

ప్రతి ప్రభుత్వ సర్వీసు ఆధార్ ప్రామాణికం కావడంతో వీటి సేవలకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంది. ఆధార్ నమోదు అనేది ఉచితంగా చేయాలి. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్(5 నుంచి 7, 15 నుంచి 17 ఏళ్ల వారికి) కూడా (మిగతా 6వ పేజీలో)

అమరావతిలో డబ్ల్యూబీ, ఏడీబీ బృందం పర్యటన

తుళ్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతిలో జరుగుతున్న ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ జాయింట్ టెక్నికల్ మిషన్‌లో భాగంగా 4వ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఏఐయూడీపీ)అమలులో భాగంగా రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నిర్వహణ, రహదారులు, బీఆర్టీ ప్రణాళిక తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అమలు కావాల్సిన కార్య కలాపాలపై రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం చర్చలు జరిగాయి. బృందంతో పాటు సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు ట్రాఫిక్ ఫ్లో నిర్వహణ, రహదారులు, బీఆర్టీ ప్రణాళికపై పలు సెషన్లు నిర్వహించారు. అధికారులు, సీజీఎంసీ(ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ), పీఎంసీ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ), కాంట్రాక్టర్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్టేక్‌హోల్డర్ కన్సల్టేషన్‌లో భాగంగా సీఆర్డీఏ అధికారులు, విలేజ్ ఫెసిలిటేటర్స్, ఎన్‌జీఓ సంస్థలతో డబ్ల్యూబీ, ఏడీబీ బృందం సమావేశమైంది. రాయపూడిలో స్థానికులతో సమావేశమై బృందం భూ సమీకరణ, సంక్షేమ పథకాలతో పాటు పలు అంశాలు చర్చించింది. అలాగే ఎన్‌సీసీ ఆర్‌వీఆర్ సంస్థల లేబర్ క్యాంపులను సందర్శించింది. సీఆర్డీఏ అధికారులు, కార్మికులతో కలసి క్యాంపు సైట్‌లలో బృంద సభ్యులు మొక్కలు నాటారు.



రాజధానిలో కార్మికుల ఆహార శాలను సందర్శిస్తున్న బృందం

అంగడిలో ఆధార్ కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

ఉచితంగానే చేయాలి. బయోమెట్రిక్ అప్‌డేట్ (డెమోగ్రాఫిక్/లేకుండా) రూ.100 చెల్లించాలి. పేరు, జనన తేదీ, లింగం, చిరునామా, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ అప్‌డేట్ చేయాలంటే విధిగా రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. సెంటర్లలో డాక్యుమెంట్ అప్‌డేట్‌కు రూ.75, ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకొనేటట్లు అయితే ఉచితం. ఆధార్ పీవీసీ కార్డుకు రూ.30

చెల్లించాలి. అయితే బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఉన్న ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన చార్జీల కంటే అదనంగా రెండు, మూడు రెట్లు వసూలు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా కేంద్రాలు..

గుంటూరు నగరంలో నకిలీ ఆధార్ నమోదు కేంద్రాలు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొద్ది రోజుల వ్యవధిలో చాలా చోట్ల ఏర్పాటయ్యాయి. వీటికి రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదు. జనన తేదీ మార్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రం అప్‌లోడింగ్ చేసి.. ఆధార్‌లో సవరణ జరిగేలా చేస్తూ రూ. 5 వేలు తీసుకుంటున్నారు. దీంతో వయస్సు తక్కువ ఉన్నా.. సామాజిక పింఛన్ కోసం చాలామంది దరఖాస్తులు చేసుకోవడం ప్రారంభించారు. దీనిపై తక్షణమే రెవెన్యూ శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

● 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ నిందితుల వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం గాజువాక ఎర్రగడ్డ కాలనీకి చెందిన తోట శివకుమార్ అలియాస్ శివభవానీ, అతని భార్య వరలక్ష్మి, కడప జిల్లా అక్కయ్యపల్లికి చెందిన షేక్ ఇంతియాజ్ కలిసి చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. డిసెంబరు 4వ తేదీన వీరు మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని ఓ ఇంట్లో ఆరు జతల వెండి పట్టీలు, ఒక జత చెవిదిద్దులు, బంగారు మాటీలు, రూ.20 వేల నగదు దొంగిలించి కడపకు వెళ్లారు. ఆ తర్వాత కడప, దువ్వాడ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఎర్రబాలెం గ్రామంలో జరిగిన చోరీకి సంబంధించి బాధితుడు భూక్యా వీరాంజనేయులు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 19 గ్రాముల



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

బంగారం, 740 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్ఐలు చిరుమామిళ్ల వెంకట్, బాలు నాయక్, ఏఎస్ఐ రత్నరాజు, కానిస్టేబుల్ సాగర్ పాల్గొన్నారు.

జీవో 36ను అమలు చేయాలి

● సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

● జిల్లాలో ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు

గుంటూరు సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సహకార సంఘాలలో జీవో 36ను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం గుంటూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2019లో జారీ చేసిన జీవో 36ను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఈ జీవో అమలు కావటం ద్వారా సహకార పరపతి సంఘాలలో పనిచేసే సిబ్బందికి జీతాలు ప్రతి నెలా అందే అవకాశం ఉందని తెలిపారు. సహకార పరపతి సంఘాలలో పనిచేసే ఉద్యోగులకు రెండు పీఆర్‌సీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని



ధర్నాలో పాల్గొన్న సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలలో జిల్లా అధ్యక్షుడు కొండవీటి చిన్నారావు, ప్రధానకార్యదర్శి గోగినేని కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుపళ్ల విభాగంలో విజేత పల్నాడు జిల్లా ఎడ్లు



బండను లాగుతున్న ఎడ్లు

గురజాలటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీల్లో సోమవారం ఆరుపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత విజేతగా నిలిచింది. 4,014 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం సాధించింది. బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన మేస్త్రి ఖాదర్ మస్తాన్, తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన గాదె ఆషేక, సుమన్‌రెడ్డిల సంయుక్త ఎడ్లజత 3,886 అడుగులతో రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, మధు ఎడ్లజత 3,871 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత 3,776 అడుగులతో నాలుగో స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3,750 అడుగులతో ఐదోస్థానం, గుంటూరు జిల్ల కొండేపాడుకు చెందిన చాగంటి శ్రీనివాసచౌదరి ఎడ్లజత 3,539 అడుగులతో ఆరో స్థానంలో నిలిచాయి.

ముగిసిన సాఫ్ట్‌బాల్ పోటీలు



విజేతగా నిలిచిన గుంటూరు బాలికల టీం

చుండూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మోదుకూరు శ్రీవేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన బాల బాలికల టీంలు పోటీ పడ్డాయి. సోమవారం జరిగిన బాలికల ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపై గుంటూరు 4-2 పాయింట్స్ తేడాతో విజయం సాధించింది. బాలుర ఫైనల్స్‌లో కడపపై విజయనగరం జట్టు 2-1 పాయింట్లతో విజయకేతనం ఎగరవేసింది. విజేతలకు గుంటూరు ఎపెక్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ రిఫరీ అన్నపరెడ్డి జగదీశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, జిల్లా పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టోర్నమెంట్ పర్యవేక్షకుల బాలికల విభాగం జయరాజు (తూర్పుగోదావరి), బాలుర టీం పర్యవేక్షకుడు చంద్రశేఖర్ (కడప) హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పద్మాకరరావు, అన్నపరెడ్డి నరసారెడ్డి, చంద్రమోహనరావు, మన్నార్ అమర్‌నాథ్, మన్నవ బద్రీనారాయణ, (ఏపీ టీం కోచ్) గాయం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు పొడిగింపు

సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు అపరాధ రుసుంతో ఈ నెల 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో ఈ నెల 12వ తేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో ఈ నెల 15వ తేదీ వరకు, రూ. 500 అపరాధ రుసుంతో ఈ నెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

ఏఎన్‌యూ-ఎన్టీఆర్ బయోసెన్సర్స్ మధ్య ఎంవోయూ

ఏఎన్‌యూ డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం-ఎన్టీఆర్ బయో సెన్సర్స్ మధ్య సోమవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ మేరకు విశ్వవిద్యా



వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామప్రసాద్ సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న రిజిస్ట్రార్ సింహాచలం, కంపెనీ ప్రతినిధి సురేశ్

లయం తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, బయోసెన్సర్స్ పరిశ్రమ ప్రతినిధి కె.సురేష్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు సంస్థలు అవగాహన ఒప్పందంలో భాగంగా పరిశోధనలు ప్రోత్సహించడం, మెడికల్ ప్రయోగశాలను వినియోగించడం, పరిశోధన నైపుణ్యాలను ఇచ్చిపుచ్చుకోవడం, వ్యవస్థాపక కార్యక్రమాలతో పాటు విద్యా ర్థులకు మెడికల్ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వనున్నాయి. బయో మెడికల్ ఇంజనీరింగ్, వైద్య పరికరాలు, బయో సెన్సర్స్ రంగాల్లో ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు చేపట్టనున్నాయి. ఈ అవగాహన ఒప్పందం మూడేళ్ల కాలంలో విద్యార్థులకు కార్యశాలలు నిర్వహిం చడంతో పాటు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నారు. అలాగే విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇస్తూ పరిశ్రమల మార్గదర్శకత్వ విజ్ఞానంలో తీర్చిదిద్దుతారు.

విద్యార్థులకు వీసీ అభినందన



వీసీకి బహుమతులను చూపిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ఏఎన్‌యూ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎరీనా- 2025 స్పోర్ట్స్ కాంపిటీషన్స్ నిర్మల ఫార్మసీ కళాశాల, మంగళగిరి వారు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఫార్మసీ విద్యార్థులు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ గంగాధర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారు గెలుపొందిన బహుమతులు వీసీకి చూపించారు. ఖోఖో ఉమెన్స్, వంద మీటర్ల రిలే రన్నింగ్‌లో ప్రథమ బహుమతులు, చెస్‌లో ద్వితీయ బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తేజోమూర్తి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్ పాల్గొన్నారు.

సంక్షేమంపై ఏఐ

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులను, వారికి అందే సేవలను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ.. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు వందకు పైగా వసతి గృహాలున్నాయి. ఇందులో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా వేర్వేరు హాస్టల్స్ అందుబాటులో ఉన్నాయి. దాదాపు పదివేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతూ చదువుకుంటున్నారు. అయితే హాస్టల్స్‌లో నిత్యం ఏదో ఒక సమస్య విద్యార్థులని వేధిస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ అమలు చేయకపోవడం, కూరలు, భోజనంలో నాణ్యత లోపించడం, మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, మౌలిక వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలు పరిష్కరించడంతోపాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

యాప్‌తో పర్యవేక్షణ ఇలా

సంక్షేమ వసతి గృహాల్లో ఉదయం స్టడీ అవర్స్ నుంచే యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. స్టడీ అవర్స్ నిర్వహణ, మరుగుదొడ్ల పరిస్థితి, విద్యార్థులకు అందించే మెనూ వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు స్నానాలు చేసి పరిశుభ్రంగా ఉన్నారా లేదా అనే విషయాలు రికార్డు చేయాలి. అంతే కాకుండా రోజూ అల్పాహారం, కూరగాయలు, భోజనం నాణ్యత ఎలా ఉంది, ఎంతమంది విద్యార్థులు భోజనం చేశారు, భోజన సమయంలో మంచినీటి నాణ్యత, హాస్టల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉందా లేదా అనే వివరాలు యాప్ ద్వారా పర్యవేక్షిస్తారు. నిర్దేశించిన వివరాలను నిత్యం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో అప్‌లోడ్ చేసే ఫొటోలు, వీడియోలో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే కృత్రిమ మేధ ద్వారా పనిచేసే యాప్ రాష్ట్రస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తుంది. వెంటనే లోపాల గురించి సంక్షిప్త సమాచారం సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు సదరు అధికారుల నుంచి సమాచారం చేరుతుంది. ఫలితంగా లోపాలకు అవకాశం లేకుండా ఉంటుందని వెల్ఫేర్ ఆఫీసర్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 రోజుల క్రితం ఈ యాప్‌ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇందుకోసం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఆధార్ నంబరుతో పాటు ప్రత్యేకంగా పాస్‌వర్డ్‌ను అందించారు. దీని లాగిన్ అయిన తర్వాత రోజువారీ సమాచారం యాప్‌లో అప్‌లోడు చేయాల్సి ఉంటుందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వెల్లడిస్తున్నారు.

రైతుల శ్రేయస్సు కోసం

ఏఎంసీల చైర్మన్లు దృష్టి పెట్టాలి

● రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంపై వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సూచించారు. సోమవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో విజయవాడ రీజియన్ పరిధిలోని



ఏఎంసీల చైర్మన్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ విజయ సునీత

9 జిల్లాల్లో ఉన్న ఏఎంసీల చైర్మన్లకు శిక్షణ తరగతులు జరిగాయి. కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఏఎంసీల పరిధిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి చైర్మన్లు అధిక ప్రాధాన్యం కనబరచాలన్నారు. చాలా మార్కెట్ కమిటీల్లో ఆదాయం చాలా తక్కువగా ఉంటుందని, దీనిపై చైర్మన్లు దృష్టి పెట్టి మార్కెట్ ఫీజుల వసూళ్లను పెంచాలన్నారు. చైర్మన్లకు చెక్ పవర్ పునరుద్ధరించడం, మార్కెట్ కమిటీల నిధులతో లింకు రోడ్ల నిర్మాణం, ప్రోటోకాల్, గోడౌన్లు, ప్లాట్‌ఫాంల నిర్మాణాల విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, డీడీ దివాకర్ పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెటిక్స్ పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచరును ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపర్రు ఎస్ఎన్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే 45వ రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల బ్రోచర్లను నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 13,14వ తేదీల్లో 30 నుంచి 90 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి వాకింగ్, రన్నింగ్, లాంగ్, ట్రిపుల్ జంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో వంటి పోటీలను నిర్వహించనున్నట్లు ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి గణేశుని రాంబాబు, కార్యదర్శి చెన్నుపాటి శివనాగేశ్వరావు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి గన్నమనేని రామకృష్ణప్రసాద్, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, బీసీసీఐ చీఫ్ సెక్రటరీ ఎమ్మెస్కే ప్రసాద్, అర్జున అవార్డు గ్రహీత కుమారి దీప్తి విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ప్రాంత క్రీడాకారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ముద్దన శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ముద్దన శ్రీనివాసరావు, పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు చుండూరి నాగశ్రీనివాసరావు, దొప్పలపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవీ కాలం పొడిగింపు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 26 నుంచి మరో ఆరు నెలల పాటు పదవీ కాలాన్ని పొడిగించింది. గుంటూరు డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు కొనసాగుతున్నారు.

అటకెక్కిన పర్యవేక్షణ

(5వ పేజీ తరువాయి)

హాస్టల్ నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ఇతనిని కూడా బదిలీ చేయాల్సి ఉండగా భారీ స్థాయిలో పైరవీలు చేసి బదిలీ కాకుండా చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

అంతర్గత విచారణ ప్రారంభం

ఈ వరుస ఘటనలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైంది. నిబంధనలకు విరుద్ధంగా మెస్ బిల్లులు చెల్లించడం, మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, హాస్టల్ పర్యవేక్షణ గాలికి వదిలేయడం తదితరాలపై హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై తీవ్ర స్థాయిలో ఆరోపణలున్నాయి. వీటి సాంఘిక సంక్షేమ శాఖ కమిషనరేట్ నుంచి విచారణ చేపట్టారు. డీడీ సాయి అధికారి గుంటూరు నగరానికి వచ్చి విచారణ చేపట్టినట్లు సమాచారం. కొన్ని రికార్డులు పరిశీలించి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లను ప్రశ్నించినట్లు తెలిసింది. బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న కళాశాల హాస్టల్‌లో కూడా ఆయన తనిఖీలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ, సౌకర్యాలు తదితర విషయా లు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థు లకు మెనూ అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

37,706 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 40,522 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,706 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,325 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11500	15500
273	----	----
341	10500	16500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15600
షార్క్-1	-----	----
బ్యాడిగి	10500	16700
దేవనూరు డీలక్స్	11000	16300
ఆర్మూరు	10500	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16800
నెంబరు. 5	11000	15300
273	----	----
341	12000	16500
4884	12000	14200
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	14800
బ్యాడిగి 355	11000	17000
దేవనూరు డీలక్స్	10500	16000
తాలుకాయలు	5000	7600

అర్జీల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలి

• కమిషనర్ పులి శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్‌కి ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను క్షేత్ర స్థాయిలో విభాగాధిపతులే పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ జరిగింది. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 26 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మేయర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 33 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ(ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

అసంపూర్తి పనులపై నివేదికలందజేయండి

నగరంలో వార్డుల వారీగా ప్రారంభించి, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నవభారత్ నగర్, ఎస్వీఎన్ కాలనీ, గోరంట్ల, మేరీ ప్రియ నగర్, కాకాని రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అసంపూర్తి పనులు చేసిన కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి, వారిపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ వి.శ్రీరాం ప్రసాద్, డీఈఈలు కళ్యాణరావు, వెంకటరమణ, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐశ్వర్య దంత వైద్యశాలలో ఆధునిక వైద్యసేవలు

• చీఫ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఐశ్వర్య వెల్లడి


దంత చికిత్సలు అందిస్తున్న డాక్టర్ ఐశ్వర్య

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ వైద్యశాలలో అన్నిరకాల దంత సమస్యలకు అధునాతన వైద్యపరికరాలతో అతి తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు ఐశ్వర్య డెంటల్ క్లినిక్, ఇంప్లాంట్ సెంటర్‌కు చెందిన చీఫ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. కొరిటెపాడు సాయిబాబా రోడ్‌లోని ఎంజీ హౌస్ ఎదురుగా గల ఐశ్వర్య డెంటల్ క్లినిక్, ఇంప్లాంట్ సెంటర్‌లో సోమవారం జరిగిన ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యశాల ప్రారంభించిన ఏడాది కాలంలోనే ప్రజల మన్ననలను పొందటం ఆనందంగా ఉందని డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. ఫుల్ మౌత్ రీహ్యాబిలిటేషన్, డెంటల్ ఇంప్లాంట్స్, ఇన్‌విజులైన్ అలైనర్స్, స్మైల్ డిజైనింగ్, రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్, టీత్ వైటనింగ్, లేజర్ సర్జరీ, చైల్డ్‌కేర్ వంటి అధునాతన వైద్యసేవలు తమ దగ్గర లభిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో గుంటూరు, పరిసర ప్రాంతాల్లో విరివిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. వైద్యశాల మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 8, 9, 10 తేదీలలో ఓపీ సేవలు ఉచితమని డాక్టర్ ఐశ్వర్య వెల్లడించారు.

అవినీతికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలి

గుంటూరు సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి హానికరంగా పరిణమించిన అవినీతికి వ్యతిరేకంగా అందరూ పోరాడాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీల అన్నారు. బీజీ హ్యూమన్ రైట్స్, ఆంటీ కరప్షన్ ఫౌండేషన్ డే సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానవ హక్కుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సజీలా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్, చైర్మన్ బయ్యపునేని వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా చైర్మన్ నల్లమోతు రవి కుమార్, ఏపీ లీగల్ సెల్ చైర్మన్ మోతుకూరి శ్రీనివాసరావు, నేషనల్ డైరెక్టర్లు పి.పవన్ కుమార్, తిరుపతిరావు, వెంకట శివకృష్ణ, ఏపీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం : కొల్లా

గుంటూరు (తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి, రైతాంగానికి వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారని, వాటి రద్దుకు కార్మిక, కర్షకులంతా ఐక్యంగా పోరాడా లని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) (న్యూ) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలోని బళ్లారి రాఘవా ఓపెన్ థియేటర్‌లో సోమవారం ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పంగా గణేష్ అధ్యక్షతన రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. ఏఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయ్ కుమార్, జాతీయ నాయకుడు పీకే షాహిలు ప్రసంగిస్తూ సామ్రాజ్యవాదుల, కార్పొరేట్లకు అడవుల్ని అప్పజెప్పడం కోసమే కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. తొలుత జిన్నాటవర్, కొత్తపేట మీదగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వరకు ప్రదర్శన నిర్వహించారు. సభలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. ఝాన్సీ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు, డీవీఎన్ స్వామి, వి.హనుమంతరావు, లలిత కుమారి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు ప్రసంగించారు.

17న జిల్లాకు అంచనాల కమిటీ రాక

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ ఈ నెల 17వ తేదీన జిల్లాలో పర్యటించనుంది. 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు చేరుకుని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల బడ్జెట్ అంచనాలపై సమీక్షిస్తుంది.

జనవరి 7న ఆర్వీఆర్ అండ్ జేసీలో రూపజ్ఞ ప్రోటోటైప్ ఛాలెంజ్

గుంటూరు (విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చే ఏడాది జనవరి 7న రూపజ్ఞ పేరుతో జాతీయ స్థాయిలో ప్రోటోటైప్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్స్ ఆవిష్కరణ నిర్వహించారు. ఆర్వీఆర్ అండ్ జేసీ ఎస్టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఆర్వీఆర్‌జేసీ డాట్ ఏసీ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.


పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

ఓపెన్ పికల్ బాల్ పోటీలలో విజేతగా నేహా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అఫ్ గుంటూరు ఆదర్శ ఆధ్వర్యంలో, స్థానిక వీవీవీ హెల్త్ హబ్‌లో జరిగిన గుంటూరు ఓపెన్ పికల్ బాల్ పోటీలు సోమవారంతో ముగిసాయి. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి చెందిన టీ నేహా డబుల్ టైటిల్ సాధించింది. ఓపెన్ డబుల్స్‌లో విన్సెంట్, నాగరాజు(విన్నర్), పి.ఆనంద్ కుమార్, కె.అరుణ్ కుమార్ (రన్నర్)లుగా నిలిచి టైటిల్స్‌ను కైవసం చేసుకున్నారు. మాస్టర్ గేమ్స్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ టీవీ రావు, అసిస్టెంట్ గవర్నర్, రోటరీ క్లబ్ భాస్కరరావు, గుంటూరు ఆదర్శ అధ్యక్షురాలు మన్నె అనురాధ, సీనియర్ న్యాయవాది రవీంద్రబాబు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

సంతృప్తి స్థాయిని పెంచేలా ఫిర్యాదుల పరిష్కారం

• కలెక్టర్ తమీమ్ అన్సారియా • పీజీఆర్ఎస్‌కు 351 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సంతృప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. సోమవారం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మొత్తం 351 అర్జీలు అందాయి. జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, ఆర్డీవో శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, శ్రీనివాస్ తో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సీతారామిరెడ్డి, డీఈవో రేణుక, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, పశు సంవర్థక శాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

● గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా వట్టిచెరుకూరు మండలం, కొర్నెపాడు లే అవుట్‌లో పట్టా ఇచ్చారని, నేటి వరకు స్థలాల్ని కేటాయించలేదని స్థానిక 48వ డివిజన్ శారదా కాలనీ, శివారు ప్రాంతంలో నివసిస్తున్న పేదలు అర్జీ అందజేశారు. ఆ పట్టా సంఖ్యలు లేవుట్‌లలో కనబడలేదన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని వాపోయారు.

● స్థానిక లాడ్జీ సెంటర్, ఏఈఎల్‌సీ సంస్థ ఎదురుగా నైట్ ఫుడ్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలనే నగర పాలక సంస్థ అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఏఈఎల్‌సీ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కళాశాల, పాఠశాల, చర్చిలు ఉండే ఈ ప్రాంతంలో ఈ స్ట్రీట్ ఏర్పాటు చేయడం సరైనది కాదన్నారు.

● తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరచారి కుటుంబానికి రూ కోటి పరిహారం అందజేయాలని కోరుతూ ఓబీసీ, బీసీ, బీసీ మహాజన, ప్రజా సంఘాలు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో అంగిరేకుల వరప్రసాదు యాదవ్, ఉగ్గం సాంబశివరావు, వరగాని ఏడుకొండలు, సాదం సత్యనారాయణ, హరినాధ్, శివప్రసాదు, కైలా జయసుధ తదితరులు ఉన్నారు.

● దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని విభిన్న ప్రతిభావంతుల ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. ఈనెల 3న దివ్యాంగుల దినోత్సవంలో ఏర్పాట్లపై విచారణ జరిపించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ వారంతపు శనివారంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు శివప్రసాదు, ఎస్.బ్రహ్మయ్య, హనిమభాయ్, సైదారాజు, విజయ్ తదితరులు ఉన్నారు.

● కేంద్ర ప్రభుత్వం అందజేసే సబ్సిడీ రుణాల వివరాలను బ్యాంకుల వద్ద ప్రదర్శించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అర్జీ అందజేశారు. అర్జీని అందజేసిన వారిలో భజరంగ్ రామకృష్ణ, తురక రామారావు, అంబేద్కర్ తదితరులు ఉన్నారు.


సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళం అందజేస్తోన్న కలెక్టర్ అన్సారియా

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి : కలెక్టర్

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. తొలుత కలెక్టర్ తన మొదటి విరాళం అందించి, పతాక దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సైనికులు ప్రాణాలు త్యాగం చేస్తూ ప్రజలను కాపాడుతున్నారన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల మాట్లాడుతూ ప్రజలు విరాళాలను డైరెక్టర్, సైనిక సంక్షేమ శాఖ, మధు గార్డెన్స్, విజయవాడ 520 010 ఆన్‌లైన్ ద్వారా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ (16857)కు కరెంట్ అకౌంట్ నంబరు 33881128795, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్ ఎస్‌బీఐఎన్ 0016857, ఎంసీఆర్ కోడ్ 520002046 ద్వారా పంపించ వచ్చన్నారు. అలానే డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరు మీద చెక్కును గుంటూరు హిందూ కాలేజీ ఎదురుగా ఉన్న సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో అందించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.17,67,363 సాయుధ దళాల పతాక నిధికి సేకరణ జరిగిందన్నారు. ఎక్కువ మొత్తంలో విరాళాలు అందించిన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, విట్ అమరావతి రిజిస్ట్రార్ చంద్రశేఖర్, కోస్టల్ బ్యాంక్ మేనేజర్ షేక్ గౌస్‌బాషాను కలెక్టర్ సత్కరించారు.

వీరజవాను కుటుంబానికి ఇంటి స్థలం

2023 అక్టోబరు 17న ఉత్తరాఖండ్ కుమాన్ సెక్టార్‌లో ఆపరేషన్ స్నో లెపర్డ్ సైనిక చర్యలలో భాగంగా వెళుతూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన చిట్టుమడుగుల వాసు కిషోర్ భార్య చిట్టుమడుగుల నవీనను సత్కరించారు. ఆమెకు 3 వందల గజాల ఇంటి స్థలంను ఏటుకూరులో మంజూరు చేస్తూ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మికుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనాధ ఆశ్రమ పిల్లలకు అమృత ఆరోగ్య పథకం

గుంటూరు(విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు పొందిన అనాధ ఆశ్రమాల్లో నివసిస్తున్న అనాధ పిల్లల సంక్షేమం దృష్ట్యా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, అమృత హెల్త్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో అమృత హెల్త్ కార్డులను చిన్నారులకు సోమవారం కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 39 మంది లబ్ధిదారులకు ప్రత్యేక అమృత హెల్త్ కార్డులు ముద్రించి పంపిణీ చేయడం జరిగిందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ గుర్తింపు పొందిన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పూర్తిగా నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్యం అందుతుందని, మొత్తం 3257 శస్త్ర చికిత్సలు, చికిత్సా విధానాలకు అర్హత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ పాల్గొన్నారు.


ఎస్ఆర్ఎంలో బుక్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కెమికల్ బయాలజీపై అంతర్జాతీయ సదస్సు

తాడికొండ/తుళ్లూరు(నీరుకొండ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కెమికల్ బయాలజీ అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. రెండురోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి పేరున్న శాస్త్రవేత్తలు, పరిశోధనా రంగనిపుణులు, స్కాలర్లు హాజరయ్యా రు. యూనివర్సిటీ వీసీ ఆచార్య సతీష్‌కుమార్ సదస్సును ప్రారంభించి శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. జీవ, రసాయనశాస్త్రాల మధ్య బలమైన బంధాన్ని ఆయన వివరించారు. ఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ స్కూల్ డీన్ డాక్టర్ సీవీ టా మి వర్సిటీలోని ఇంటర్ డిసిప్లినరీ ఎంగేజ్‌మెంట్ విలువను వివరించారు. ఈ సదస్సులు శాస్త్రవేత్తల పరిశోధనా సామర్థ్యాలను పెంచేందుకు దోహదపడతాయన్నారు. వర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా జీవరసాయన శాస్త్రంలో పెరుగుతున్న పరిశోధనలు, వాటి ప్రాధాన్యాలను వివరించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ అబ్స్ట్రాక్ట్ బుక్‌ను ఆవిష్కరించారు. సదస్సులో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సబ్యసాచి చక్రవర్తి, కన్వీనర్ డాక్టర్ ఎల్లిపెల్లి సతీష్, డాక్టర్ రాజపాండ్యన్, ప్రొఫెసర్‌లు రాఘవన్ వరదరాజన్, హరినాథ్, సోను వేణుగోపాలరావు, డాక్టర్ వెంకట శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైల్వేలో ఘనంగా మహా పరినిర్వాణ దినోత్సవం

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక పరివర్తన కోసం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చిన విజ్ఞానించు-ఉద్యమించు-వ్యవస్థీకరించు అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు డీఆర్ఎం సుదేష్ణ సేన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో మహా పరినిర్వాణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి డీఆర్ఎంతో పాటు పలువురు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఏసీఎం డీ వినయ్‌కాంత్ పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు : డీఈవో

గుంటూరు(విద్య), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డీఈవో సీవీ రేణుక అన్నారు. సోమవారం పరీక్షా భవన్‌లో కౌశల్ జిల్లాస్థాయి విజేతల బహుమతుల ప్రదానోత్సవంలో డీఈవో రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో శాస్త్రీయ ప్రతిభను పెంపొందించడానికి కౌశల్ పరీక్షలు దోహదపడతాయని అన్నారు. జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 610 మంది పరీక్ష రాయగా ఆరుగురు ప్రథమ, ఆరుగురు ద్వితీయ బహుమతులు పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. డీఈవో రేణుక, ఉపవిద్యాశాఖ అధికారి యేసు రత్నం విజేతలకు ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు పాఠశాల కో ఆర్డినేటర్లు శాంతి ప్రియ, రామాంజనేయులు, రవీంద్రబాబు, నిర్మల, బాలకృష్ణ, యుగంధర్ పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎస్‌కెబిఎం స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎంపి సుబ్బారావుపై ఉన్న సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టిఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి హైమారావు, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా అధ్యక్షులు నరసింహారావు తదితరులు వేర్వేరు ప్రకటనలలో విజ్ఞప్తి చేశారు. ఈమేరకు డీఈవో సీవీ రేణుకకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుడు సుబ్బారావు ఈనెల 5న జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా కాకతాళీయంగా విద్యార్థుల్ని దండించారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సాముహిక తులసి సహస్రనామార్చనలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్ నగర్, శ్రీ రామనామక్షేత్రంలో 99వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీమాన్ క్రోసూరి కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందంతో ధ్వజారోహణ, సంతానార్థులకు గరుడప్రసాద వితరణ జరిగింది. సామూహిక శ్రీరామకోటి తులసి సహస్రనామార్చనలు, వేదపారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సువాసినులచే హనుమాన్ చాలీసా పారాయణ, పురాణం వాక్యాన్ని శేష సాయి, తిరుపతి వారిచే శబరి భక్తి ఉపన్యాసం, భక్తి రంజనిలో బసవరాజు జయ శంకర్, మునిపల్లె రమణి శ్రీ రామదాసు కీర్తనలను ఆలపించారు. సాయంత్రం శేషవాహనంపై శ్రీ రామకోటి పుస్తకాలతో నగరోత్సవం నిర్వ హించారు. ఈ కార్యక్రమాల్ని బెల్లంకొండ మస్తాన్‌రావు, రాగం వెంకట లీలాసుందరి, పి బ్రాహ్మణయ్య నాయుడు, వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

వైద్య కళాశాలలో క్యాంటిన్ ప్రారంభం

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులైన వైద్యుల వితరణతో జీఎంసీలో నూతనంగా నిర్మించిన క్యాంటీన్‌ను సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి ఆధ్వర్యంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ క్యాంటిన్ నిర్మాణం కోసం జీఎంసీ పూర్వ విద్యార్థి, మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జే.నరేష్ బాబు రూ.25 లక్షలు, న్యూరో సర్జన్ డాక్టర్ మర్రెడ్డి రామకృష్ణారెడ్డి రూ.10 లక్షలు, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అల్లా శారద రూ.6 లక్షలు, అదనంగా కళాశాల అభివృద్ధి నిధి ద్వారా మరో రూ.6 లక్షలు, మొత్తం సుమారు రూ.50 లక్షల వ్యయంతో క్యాంటీన్‌ను ఆధునికీకరించారు. ఈ కార్యక్రమంలో శరీర నిర్మాణ శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జీ.నాగేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ (అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ మాధవి, క్యాంటీన్ ఇన్‌చార్జి, ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సాల్మాన్ రాజు, బోధన, బోధనేతర సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణం శివ శ్రీనివాసరావుకు అభినందనలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పోలీస్ వెల్ఫేర్ చైర్మన్‌గా ఎన్నికైన కల్యాణం శివ శ్రీనివాస్‌రావును సోమవారం జనసేన ప్రధాన కార్యాలయంలో జిల్లా జనసేన నాయకులు, సేవా సదన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి జిల్లాలో జరిగే అభివృద్ధి, ఇతర సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మిరియాల గోపికుమార్, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, డేగల వెంకటేశ్వరావు, రాజశేఖర్, బత్తుల నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, బోడపాటి కేశవ నాయుడు, ఎస్ఎస్ సూరి ఉన్నారు.

కబ్జాపై ప్రశ్నిస్తే వైసీపీ నాయకుడి దాడి

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లాల్‌పురం గ్రామంలో తన స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగ్గొట్టాడని పట్టాభిపురంకు చెందిన ఉప్పు శంకరరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను 2011లో లాల్‌పురం గ్రామంలో 13 సెంట్ల భూమి కొనుగోలు చేశానని, రెండు నెలల క్రితం తన భూమిని కబ్జా చేశారన్నారు. తాను, తన కుమారుడు వెళ్లి ప్రశ్నించగా తనపై దాడి చేసి కుడికాలు విరగ్గొట్టారన్నారు.

దొంగల ముఠాపై చర్యలు తీసుకోండి

గత నెల తాను, తన భార్య పొన్నూరు నుంచి గుంటూరుకు ఆర్టీసీ బస్సులో వచ్చిన సమయంలో తమ పర్సు నుంచి బంగారు ఆభరణాలు కొట్టేశారని, వారిపై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పొన్నూరు మండలం ఇటికంపాడు గ్రామానికి చెందిన రమేష్ బాబు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. టీడీపీ కార్పొరేటర్ పోతురాజు సమతతో కలిసి ఆయన ఎస్పీని కలిసి చోరీ కేసు గురించి వివరించారు. తాము గత నెల 14న హైదరాబాద్ వెళ్లేందుకు పొన్నూరు నుంచి ఆర్టీసీ బస్సులో గుంటూరు వచ్చామన్నారు. బీఆర్ స్టేడియం వద్ద బస్సు దిగి ఆటోలో రైల్వే స్టేషన్‌కు వెళ్ళామన్నారు రైల్వేస్టేషన్లో బ్యాగు చూసుకోగా అందులోని 12 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదన్నారు. స్టువర్టుపురానికి చెందిన నలుగురు మహిళల గ్యాంగ్ ఆ రోజు తమతో పాటు బస్సులో ప్రయాణించారన్నారు. తన బ్యాగులో బంగారు ఆభరణాలు కొట్టేసిన ముఠా పై చర్యలు తీసుకొని బంగారం రికవరీ చేయాలని బాధితుడు రమేష్ బాబు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితుడికి తగిన న్యాయం చేయాలని కొత్తపేట పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

నాడు విధ్వంసం.. నేడు వికాసం

• తూర్పు ఎమ్మెల్యే నసీర్ • రూ.1.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గత ఐదేళ్లలో జగన్ విధ్వంస పాలన నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వికాసం వైపు పయనిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక రాహుల్ గాంధీ నగర్, మద్దిరాల కాలనీ, మంగళదాస్‌నగర్‌లలో సోమవారం ఆయన రూ.1.46 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రూ.26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో కనీసం మురుగు కూడా తీయని పరిస్థితి ఉండేదని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని డివిజన్లలో అభివృద్ధికి పునాదులు వేశామని తెలిపారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, మురుగునీరు రోడ్లపై నిలుస్తుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళుతున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు.



గుంటూరు మస్తాన్ దర్గా వద్ద జీటీ రోడ్డులో ఏర్పడిన గుంతలను పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా పూడ్చారు. జీటీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దీంతో తన సొంత నిధులతో కంకర, డస్ట్ తెప్పించి గుంతలు పూడ్చి శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

'పశ్చిమ'ను అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతా

• ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గంలో రూ.8.5 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ 22వ డివిజన్ 60 అడుగుల రోడ్డు, అచ్చయ్య డాబా సెంటర్ వద్ద సీసీ రోడ్డు, నల్లచెరువు 8వ లైన్ వద్ద సీసీ రోడ్డు, డ్రెయిన్, భాగ్యనగర్ మొదటిలైను లైనులో సీసీ రోడ్డు, అరండల్‌పేట ఒకటోలైనులో జరిగే బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్

నల్లచెరువు సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారన్న ఫిర్యాదులతో పోలీసులపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్ అయ్యారు. మందుబాబులతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మరోసారి ఇలాంటివి పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవు అంటూ పోలీసులను ఆమె హెచ్చరించారు.

దమ్ముంటే జగన్, అంబటి రాజధానిలో పర్యటించాలి

• టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గోబెల్స్ సంఘం జాతీయ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అంబటి రాంబాబుకి దమ్ము, ధైర్యం ఉంటే రాజధానిలో పర్యటించి ఆ తర్వాత భూసమీకరణ విధానం గురించి మాట్లాడాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు సవాల్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చిన వైసీపీ అగ్ర నేతలు నేడు ఏ ముఖం పెట్టుకొని భూసమీకరణ విధానాన్ని ప్రశ్నిస్తున్నారో అంబటి సమాధానం చెప్పాలన్నారు. అధికారంలోకి రాగానే అమరావతిని సర్వనాశనం చేయటమే కాకుండా ఆ ప్రాంత మహిళల ఉసురు పోసుకొని జగన్‌రెడ్డికి ప్రతిపక్షహోదా కూడా రాకుండా పోయిందని అన్నారు. రైతులు చంద్రబాబుని నమ్మి భూములిస్తుంటే అడ్రస్ లేని సంఘాలతో మేధావుల ముసుగులో ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని అన్నారు.

జగన్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

• బీసీ సంఘాల నాయకుల డిమాండ్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ ప్రజా ప్రతినిధులు, అధికారులపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అమరావతి రోడ్డులో సోమవారం బీసీ మహాజన సభ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు అధ్యక్షతన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బిపి మండల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య, ఉన్నతాధికారి గోపినాథ్ జెట్టి లాంటి వ్యక్తులను కించపరిచే విధంగా మాట్లాడటం దారుణమన్నారు. ఉగ్గం సాంబశివరావు మాట్లాడుతూ బీసీలను తక్కువగా చూసినందుకే గత ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పారని అన్నారు. ఈ సమావేశంలో జీఆర్ భగత్ సింగ్, తాడికొండ నరసింహారావు, తన్నీరు సాంబయ్య, టి.హరినాథ్ బాబు, అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, చంద్ర నాయక్, సత్యనారాయణ, వరగాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర సిబ్బంది సస్పెన్షన్ ఎత్తివేత

గుంటూరు(తూర్పు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, గణపవరంలోని ఆరోగ్య కేంద్ర సిబ్బందిపై సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య రాష్ట్ర కమిషనర్ వీర పాండియన్ తెలిపారు. సస్పెండ్ చేసిన 12 మంది ఉద్యోగులను విధులలోకి తిరిగి తీసుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం, వీర పాండియన్‌ను ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ విద్యాసాగర్ కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ వారి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సస్పెన్షన్ ఎత్తివేతకు కృషి చేసిన విద్యాసాగర్, సంఘ కార్యదర్శి రమణ, గుంటూరు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, మర్లపాటి రామకృష్ణలకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

నేడు వర్చువల్‌గా డీసీఏలను ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం రాష్ట్రంలోని డ్రగ్ స్టోర్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ 6వ అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని ఆమె తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, విజిలెన్స్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి నేతృత్వంలో నగరంలో సంయుక్త తనిఖీలు నిర్వహించారు. నగరంలో డి 9 సెక్షన్ పరిధిలోని బొంగరాలబీడు, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, వసంతరాయపురం ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఈఈ (డీపీఈ) ఎస్ఏ కరీమ్, ఆపరేషన్ ఈఈ టి శ్రీనివాసబాబు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారితో పాటు అదనపు లోడ్, బిల్లు తక్కువ ఇచ్చిన సర్వీసును గుర్తించి మొత్తం రూ.9.21 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో డిప్యూటీ ఈఈలు పి.రమేష్, ఎన్ మల్లికార్జునప్రసాద్, కే రవికుమార్, ఎస్ శ్రీనివాసరావు, ఏఈఈ రవికుమార్, శివశంకర్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్ తదితరులున్నారు.



















అమరావతి జిగేల్ జిగేల్

● అబ్బురపరుస్తున్న రాజధాని నైట్ వ్యూ

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గాఢాంధకారంలో ఉన్న రాజధాని అమరావతి నేడు విద్యుత్ దీపాల వెలుగులతో జిగేల్ జిగేలున వెలిగిపోతోంది. నగరంలో రాత్రి వేళ దృశ్యాలు (నైట్ వ్యూ) చూపరులను అబ్బురపరుస్తున్నాయి. ఏపీసీఆర్‌డీఏ డ్రోన్ ద్వారా రాజధానిలో జరుగుతోన్న నిర్మాణ పనులు, ఇప్పటికే పూర్తయిన భవనాలు ఏ విధంగా ఉన్నాయో చిత్రీకరించారు. అలానే రాత్రి వేళ జరుగుతోన్న పనులను కూడా డ్రోన్ కెమెరాల ద్వారా ఏరియల్ షూట్ చేశారు. ఏఐఎస్ బంగ్లాలు, ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ టవర్లు, గ్రూపు-డీ టవర్లు, ఎన్‌జీవో టవర్లు, హ్యాపీ నెస్టు ప్రాజెక్టు, ఏఐఎస్ టవర్లు, కోర్ క్యాపిటల్ ఏరియా, సెక్రెటేరియట్ టవర్స్ చిత్రాలను ఆదివారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా నిమిషాల వ్యవధిలోనే వందల సంఖ్యలో వ్యూస్, లైకులు వచ్చాయి. దేశ, విదేశాల్లో ఉన్న ఈ ప్రాంత ప్రజలు వేగవంతంగా జరుగుతోన్న అభివృద్ధిని చూసి మురిసిపోతూ ఆ చిత్రాలను వారి సామాజిక మాధ్యమాల ఖాతాల నుంచి షేర్ చేస్తున్నారు.

అమ్మ ఫోను ● గర్భిణులు ఫోన్ వాడితే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్..!

పిల్లలకు చేటు

- గుంటూరులో వెలుగు చూసిన రెండు కేసులు
- అరుదైన శస్త్రచికిత్సతో ట్యూమర్ల తొలగింపు
- కిమ్స్ న్యూరో సర్జరీ వైద్యనిపుణుల ఘనత

గుంటూరు మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు చిన్నారులు సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ ఎక్కువగా వాడితే వారిలో తెలివితేటలు తగ్గుతాయని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా గుంటూరులోని ప్రముఖ వైద్యశాలలో పుట్టుకతోనే ఇద్దరు పసికూనలు బ్రెయిన్ ట్యూమర్‌కు గురైన విషయం తెలిసి వైద్య వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. బహుశా గర్భిణీలు మొబైల్ ఫోన్ వాడటం, ల్యాప్‌ట్యాప్ చూడటం లేదా రేడియే షన్‌కు గురికావడం వల్ల పుట్టిన శిశువులకు బ్రెయిన్ ట్యూమర్ సోకి ఉంటుందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌కు ఇటీవల పది రోజుల వయస్సు ఉన్న ఇద్దరు పసి కందు లను తీసుకొచ్చారు. ఇద్దరు అరుదైన బ్రెయిన్ ట్యూమర్‌కు గురైనట్లు వైద్య వర్గాలు గుర్తించాయి. అయితే ఈ కేసులను సవాల్‌గా తీసుకున్న కిమ్స్ వైద్యులు ఆపరేషన్ చేసి విజయవంతంగా మెదడులో ఏర్పడ్డ కణితులను తొలగించారు. కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, కిమ్స్ కడిల్స్‌కు చెందిన డాక్టర్ సాహితి చందర్లపాటి, డాక్టర్ పవన్ సత్యం, డాక్టర్ బాలకృష్ణారెడ్డి పల్నాటి, డాక్టర్ రూపేష్, డాక్టర్ ప్రత్యూష వైద్య బృందం ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఎనస్థటిస్ట్ డాక్టర్ కల్యాణ్‌రామ్ నేతృత్వంలోని వైద్యనిపుణుల బృందం అడ్వాన్స్ టెక్నిక్‌తో ఆధునిక వైద్యపద్ధతులతో మత్తు సేవలు అందించారు. మూడు గంటల పాటు శ్రమించిన సర్జన్ల బృందం చిన్నారుల్లో బ్రెయిన్ ట్యూమర్‌ను తొలగించారు. ఆపరేషన్ తర్వాత పిల్లలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ప్రపంచంలో 300 కేసులు మాత్రమే...

ఈ సందర్భంగా చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, కోటి మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే పుట్టుకతో బ్రెయిన్ ట్యూమర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తల్లి గర్భంలోనే పిల్లలకు బ్రెయిన్ ట్యూమర్ రావడం అత్యంత అరుదని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి కేసులు ఇప్పటి వరకు కేవలం 300 మాత్రమే నమోదైనట్లు ఆయన వెల్లడించారు. బహుశా గర్భిణీలు మొబైల్ ఫోన్ వాడటం వల్ల, రేడియేషన్‌కు గురికావడం వల్ల పుట్టిన శిశువులకు బ్రెయిన్ ట్యూమర్ సోకి ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పరిశోధనలు జరగాల్సి ఉందని ఆయన తెలిపారు.



ఇద్దరు శిశువులతో కిమ్స్ న్యూరో సర్జరీ వైద్య బృందం

రూపాయి ప్లాన్ పనిచేసింది





- నయా ఆఫర్లతో ఆకట్టుకుంటున్న బీఎస్ఎన్ఎల్
- రూపాయి ప్లాన్‌తో ప్రజల చెంతకు
- ఆఫర్ నెలాఖరు వరకు పొడిగింపు..
- రోజు రోజుకు పెరుగుతున్న యూజర్లు
- వినియోగానికి తగ్గట్టుగా టవర్ల ఏర్పాటు

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల ఆదరణ పొందుతోంది. జియో, ఎయిర్‌టెల్, వొడా వంటి ప్రైవేటు నెట్‌వర్క్‌లను తట్టుకుని మార్కెట్‌లో మరింత విస్తరిస్తోంది. ఒకానొక దశలో ప్రైవేటు కంపెనీల ధాటికి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్.. చతికిల పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మెరుగైన 4జీ సేవలు అందిస్తూ.. తక్కువ ధరలతో వినియోగదారులను ఆకర్షిస్తోంది. ప్రైవేట్ కంపెనీలు కాల్ చార్జీలను అధిక మొత్తంలో పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో గుంటూరు బీఎస్ఎన్ఎల్ పరిధిలో (ప్రకాశం, గుంటూరు) వినియోగదారుల సంఖ్య 1.25 లక్షలు దాటింది. దీనిని దృష్టిలో పెట్టుకుని బీఎస్ఎన్ఎల్ తమ నెట్‌వర్క్‌ను కూడా పెంచుతుంది. అందులో భాగంగానే ఈ పరిధిలో 113 కొత్త 4జీ నెట్‌వర్క్ టవర్లను కూడా ప్రారంభించింది. దీంతో బీఎస్ఎన్ఎల్ టవర్ల సంఖ్య 732కు చేరింది.

● ఆకట్టుకుంటున్న రూపాయి ప్లాన్

బీఎస్ఎన్ఎల్ ఫోన్ వినియోగ దారులకు 75వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ ప్లాన్‌తో మళ్లీ ప్రజల ముందుకు వచ్చింది. ఒక్క రూపాయికి సిమ్‌తో పాటు 30 రోజుల వ్యాలిడితో అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబీ డేటాతో అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ అవకాశం కేవలం కొత్త కస్టమర్లతో పాటు ఎంఎన్‌పీ వినియోగదారులకు కల్పించారు. ఆగస్టు 15న ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకురాగా ఆగస్టు 31తో ఈ ప్లాన్ ముగిసి పోయింది. వినియోగదారుల నుంచి వస్తున్న స్పందన నేపథ్యంలో రెండోసారి ఈ ప్లాన్‌ను అందుబాటులోనికి తీసుకురావడంతో పాటు డిసెంబరు 31 వరకు కొనసాగిస్తున్నారు.

● వినియోదారుల అభిరుచికి తగ్గట్టుగా ప్లాన్స్

4జీ నెట్‌వర్క్‌తో వినియోగదారుల అభిరుచికి తగ్గట్లుగా బీఎస్ఎన్ఎల్ ఎన్నో రకాల ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇతర ప్రైవేట్ నెట్‌వర్క్‌లతో పోలిస్తే తక్కువ రేటుకు ఈ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. తక్కువ డేటాను వినియోగించే వారితో పాటు ఎక్కువ డేటాను వినియోగించే వారి కోసం ప్లాన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇతర నెట్‌వర్క్‌లతో పోలిస్తే వ్యాలిడితో పాటు, డేటా ఎక్కువ రావడం, రీచార్జ్ ప్లాన్ మొత్తం కూడా తక్కువగా ఉండటంతో వినియోగదారులు ఆకర్షితులవుతున్నారు. రూ.2,399 రీచార్జ్‌తో రోజుకు 2 జీబీ డేటా.. 365 రోజులు వ్యాలిడిటీ, రూ.1999 రీచార్జితో 1.5జీబీ డేటా 330 రోజుల వ్యాలిడిటీ, రూ.1499 రీచార్జితో 32 జీబీతో పాటు 300 రోజుల వ్యాలిడిటీ.. ఈ విధంగా రూ.997, రూ.599,రూ.485,రూ.347,రూ.225, రూ.199 వంటి ప్లాన్‌లతో పాటు మరెన్నో ప్లాన్‌లు అందరికి అందుబాటులో ఉన్నాయి.

● మెరుగైన సేవలు

-సప్పరపు శ్రీధర్, ఏరియా జనరల్ మేనేజర్, బీఎస్ఎన్ఎల్



వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నాం. వినియోగదారుల్లో విశ్వసనీయత పెంచే విధంగా ప్రయత్నిస్తున్నాం. అందులో బాగంగానే 4జీ టవర్లను కూడా పెంచడం జరిగింది.

పోలీసు పుత్రుడు

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. సంబంధిత కారు నంబరును గుర్తించి.. అది తమ శాఖకు సంబంధించింది కాదని నిర్థారణకు వచ్చారు. తమ అధికారులు తనిఖీలు చేయలేదని రవాణశాఖ జిల్లా అధికారి వెల్లడించడంతో.. పోలీసు శాఖ ప్రమాద ఘటనపై ప్రత్యేక దృష్టి సారించింది. తీగ లాగితే.. డొంక కదలినట్లు.. ముఠా అక్రమాల గుట్టు వెలుగు చూసింది. పోలీసు విచారణలో కంగుతినే అంశాలు వెలుగుచూశాయి.

ఒక్కసైగతో ఐదుగురు దుర్మరణం..

చిలకలూరిపేట బైపాస్‌లో ఇటీవల ట్రాలీ ఢీ కొట్టి ఐదుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన ఐదుగురి యువకుల ముఠా కారణంగానే జరిగిందని తేలింది. ఈ గ్యాంగ్ దొంగ నంబరు ప్లేటు కారులో వచ్చి.. రవాణా శాఖ అధికారులుగా నటించి సైగ చేస్తూ లారీని అకస్మాత్తుగా ఆపారు. లారీని రోడ్డు పక్కకు తీస్తున్న క్రమంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల కారు కంటెయినర్‌ను ఢీకొంది. దీంతో వారు దుర్మరణం చెందారు. ప్రమాదం ఘటన హైవే సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కంటైనర్ లారీని ఆపిన వారి గురించి ఆరా తీసిన క్రమంలో దొంగ నంబరు ప్లేటుతో రవాణా శాఖ అధికారులుగా దందాలు చేస్తున్న యువకుల ముఠా వివరాలు పోలీసులకు తెలిశాయి.

తండ్రి అండతో నేరాలు..

ఈ గ్యాంగ్ లీడర్ పోలీసు అధికారి కొడుకు కావడంతో తన నేర సామ్రాజ్యాన్ని కొనసాగించారు. ఈ ముఠా కార్లు కూడా దొంగలించి విక్రయించినట్లు పోలీసు దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. గతంలో బంగారం విక్రయిస్తామని కొందరి వద్ద రూ.40 లక్షలు కాజేశారు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేసినా విచారణ జరపకుండా అప్పటి పోలీసు అధికారులు నేరస్తులకు సహకరించినట్లు ఆరోపణ ఉంది. తండ్రి పోలీస్ అధికారి కావడంతో బంగారం కేసు నుంచి తప్పించినట్లు ప్రచారం. అలాగే కార్లు కాజేసిన కేసుల్లో కూడా తండ్రిని అడ్డుపెట్టుకొని సులువుగా తప్పించుకున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. తండ్రితో పాటు, అధికార పార్టీ అండదండలు కూడా ఈ గ్యాంగ్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. నకరికల్లు మండలం నరశింగపాడుకు చెందిన ఓ యువకుడు కూడా ఈ నేరాల్లో భాగస్వామిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరితో పాటు మొత్తం ఐదుగురు పోలీసుల అదుపులో ఉన్నారు. ఐదుగురు విద్యార్థులను బలిగొన్న ఈ గ్యాంగ్‌పై.. ఈ సారైనా కఠిన చర్యలు తీసుకుంటారో.. గతంలో వలే వదిలేస్తారో చూడాలి.

లోతుగా దర్యాప్తు..

ఈ ముఠా గురించి పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు వచ్చి కేసు వివరాలపై ఆరా తీశారు. పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి కేసు గురించి ఆరా తీశారంటే కేసు తీవ్రత ఎక్కువగానే ఉన్నట్లు భావిస్తున్నారు. పోలీసులు ఈ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు.

వందేభారత్ రైలు వేళల్లో మార్పు

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారంలో ఆరు రోజుల పాటు తెనాలి మీదుగా ప్రయాణించే చెన్నై సెంట్రల్-విజయవాడ-చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికను ఈ నెల 15వ తేదీ నుంచి మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలును నర్సాపూర్ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కారణంగా కాలమాన పట్టికలో మార్పు చేసినట్లు పేర్కొంది. రైలు నంబరు 20678 నర్సాపూర్-చెన్నై సెంట్రల్ వందేభారత్ రైలు ఈ నెల 15వ తేదీ నుంచి మధ్యాహ్నం 2.50కి బయలుదేరి తెనాలికి సాయంత్రం 5.19కి వచ్చి 5.20కి బయలుదేరి రేణిగుంటకు రాత్రి 9.50కి, చెన్నై సెంట్రల్‌కు 11.45కి చేరుకొంటుంది. రైలు నంబరు 20677 చెన్నై సెంట్రల్-నర్సాపూర్ వందేభారత్ రైలు ఈ నెల 17వ తేదీ నుంచి వేకువజామున 5.30కి బయలుదేరి 7.05కి రేణిగుంట, 11.21కి తెనాలి, 11.45కి విజయవాడ, మధ్యాహ్నం 2.10కి నర్సాపూర్ చేరుకుంటుంది. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

రూరల్ ఎస్ఐ వీఆర్‌కు బదిలీ

పొన్నూరుటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు రూరల్ ఎస్ఐ గండు కిరణ్ బాబు వీఆర్‌కు సోమవారం బదిలీ అయ్యారు. రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న కిరణ్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా రేషన్ బియ్యం అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఇద్దరు రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన పోలీసు ఉన్నతాధికారులు ఎస్సైను వీఆర్‌కు బదిలీ చేయడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. బదిలీ అయిన ఎస్ఐ స్థానంలో కొత్త ఎస్ఐ నియామకం చేపట్టలేదు.

వైభవంగా యువజనోత్సవం

● కళాకారులతో ఏఎన్‌యూ కళకళ ● విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలి: వీసీ

ఏఎన్‌యూ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతల మధ్య ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యువజనోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణం కళాకారులతో కళకళ లాడింది. ఈ ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు కళలలోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు జీవితంలో తమ కళా ప్రతిభను నెమరు వేసుకోవడానికి యువజనోత్సవం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ప్రత్యేక గౌరవ అతిథిగా విచ్చేసిన మిమిక్రీ ఆర్టిస్ట్ కె.కృష్ణం రాజు మాట్లాడుతూ, విద్యార్థులు తమలోని సృజనాత్మక తతో పాటు కళా ప్రతిభను వెలికి తీయడానికి ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. యువజనోత్సవం సమన్వయకర్త ఆచార్య ఎస్.మురళీమోహన్ మాట్లాడు తూ, యువజనోత్సవం పోటీలకు 22 కళాశాల నుంచి 400 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకు న్నారని తెలిపారు. పోటీలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా మిమిక్రీ కళాకారు డు కృష్ణం రాజు చేసిన మిమిక్రీ అందరిని ఆకట్టుకుంది. అనంతరం కృష్ణంరాజును ఉపకులపతి గంగాధరరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయం తాత్కాలిక రెక్టార్ ఆచార్య ఆర్.శివరామప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, పాలకమండలి సభ్యులు ఆచార్య కె.సుమంత్ కుమార్, సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య వీరయ్య, పాల్ కుమార్, తేజోమూర్తి, కమిటీ మెంబర్లు డా శశిధర్, డా ఎం బాబు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల్లో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు


విద్యార్థినుల సెల్ఫీ

గుంటూరు రూరల్ వార్తలు

దుగ్గిరాల యార్డులో పసుపుధరలు

దుగ్గిరాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో 324 బస్తాల పసుపు రైతులు వ్యాపారులకు సోమవారం విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,850, గరిష్ఠధర రూ.12,000 మోడల్‌ధర రూ.11,250 పలికాయి. కనిష్ఠధర రూ.10,850, గరిష్ఠం రూ.12,000, మోడల్‌ధర రూ.12,000 పలికాయి.

పశ్చిమడెల్టాకు 1716 క్యూసెక్కుల నీరు

విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 1716 క్యూసెక్కునీరు సోమవారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 10.4 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 150 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 83 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 1160 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

దుగ్గిరాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలో రబీసీజన్‌లో పంటలకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఏవో ఆర్. విజయబాబు సోమవారం తెలిపారు. మండలంలో 20వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న తదితర పంటల సాగుచేస్తారని, అంచనా వివరాలు జిల్లా మార్క్‌ఫెడ్‌కు పంపామన్నారు. ఇటీవల రైతన్నా మీకోసం కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, రబీకి సరిపడా రైతులకు ఇచ్చేందుకు యూరియా నిల్వలున్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

ఎంఈవోను కలిసిన యూటీఎఫ్ ఉపాధ్యాయులు

తాడేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండల ఎంఈవో డీ నాగేశ్వరరావును సోమవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, సత్యశివనాగేశ్వరరావు, ఆంజనేయులు, ధనరాజ్, సహాయ కార్యదర్శి సుధారాణి, జిల్లా కౌన్సిలర్ గఫార్, గౌరవాధ్యక్షుడు వైవీఎస్ ప్రసాద్, ట్రెజరర్ బురాన్, బెన్‌హర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి తమ వంతు కృషి, సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ మండల కమిటికి ఎంఈవో అభినందనలు తెలిపారు.

గిరిజన విద్యార్థుల
డైట్ చార్జీలు పెంచాలని వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న అక్కుళప్ప నాయక్

తాడేపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కుళప్ప నాయక్ సోమవారం సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అలాగే గిరిజన సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. టీఎస్ఎఫ్ నాయకులు మస్తాన్‌నాయక్, వెంకటేశ్వర్లునాయక్ తదితరులు సీఎంను కలిశారు.

ప్రత్తిపాడు స్టేషన్‌లో వార్షిక తనిఖీలు


ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ భానోదయ

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ భానోదయ వార్షిక తనిఖీలు నిర్వహించారు. అన్ని కేసులకు సంబంధించిన రికార్డులతోపాటు రౌడీషీటర్లు, ప్రమాదాలు వంటి పలు విషయాలపై ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. దీనికి సంబంధించి ప్రత్తిపాడు ఎస్ఐ నరహరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రికార్డులు ఎలా రాస్తున్నారు, పోలీసుల ప్రవర్తనపై క్షుణ్ణంగా పరిశీలించామన్నారు.

జననీ మిత్ర యాప్‌పై అవగాహన

మంగళగిరి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి గణపతి నగర్‌లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో సోమవారం ఏఐ అండ్ మెడ్‌టెక్ అలయెన్స్ ఫౌండేషన్, ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ రూపొందించిన జననీ మిత్ర యాప్‌పై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఇందిరానగర్, మార్కండేయ కాలనీ, కుప్పురావు కాలనీలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశాలు హాజరై శిక్షణ పొందారు. యాప్‌లో గర్భిణీల ఆరోగ్యం, మందుల వివరాలు, పోషకాహారం విలువలు, ప్రభుత్వ ప్రయోజనాల వంటి వివరాలను ఏవిధంగా నమోదు చేయాలో మెటర్నల్ హెల్త్ జేడీ డాక్టర్ సతీశ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష, డీపీఎంవో డాక్టర్ కే.సుజాత, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.అనూష తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో
మంచి దిగుబడి.. పంటనాణ్యత

దుగ్గిరాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విత్తనాలను శుద్ధిచేసి పొలంలో వేసుకోవడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులతోపాటు, దిగుబడి కూడా పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి కె.రాజకుమారి అన్నారు. మండల గ్రామం మంచికలపూడిలో రైతులతో జీవామృతం తయారుచేయించి, మొక్కజొన్న విత్తనాలను రైతులచే స్వయంగా శుద్ధిచేయించారు. పంటకాలంలో సంక్రమించే తెగుళ్లను అరికట్టేందుకు జీవామృతం ఉపయోగపడుతుందని, విత్తనశుద్ధితో మొలకశాతం కూడా పెరుగుతుందని రైతులకు వివరించారు. అనంతరం రైతులకు ఒక్కొక్కరికీ 5కిలోల చొప్పున బయోడైవర్సిటీ విత్తనాలను పంపిణీ చేశారు. పలువురు రైతులతోపాటు, మహిళారైతులు, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


మంచికలపూడిలో బయోడైవర్సిటీ విత్తనాలు అందుకుంటున్న రైతులు

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం


ప్రసంగిస్తున్న న్యాయాధికారి నాగరాజ

మంగళగిరి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లతో సత్వరన్యాయం జరుగుతుందని, పెండింగ్ కేసుల్లో రాజీపూర్వకంగా పరిష్కారం చేసుకోవాలని న్యాయాధికారి నాగరాజ అన్నారు. సోమవారం మంగళగిరి కోర్టుకువిచ్చేసి కోర్టులో కేసుల సంఖ్యను తగ్గించే ప్రయత్నంలో భాగంగా లోక్‌అదాలత్‌ల ప్రాముఖ్యతను వివరిస్తూ న్యాయవాదులు, పోలీసులతో సమీక్ష నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకా శివరామ్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. న్యాయాధికారి నాగరాజ మాట్లాడుతూ ఎక్కువకాలం కోర్టుకు తిరిగి సమయం వృధా చేసుకోకుండా ఇరుపక్షాలు రాజీపడితే లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోక్ అదాలత్ చైర్మన్ జియావుద్దీన్, న్యాయాధికారులు ఇఫ్రత్ ఫాతిమా, కే సురేష్‌బాబు, ఎం ప్రసన్నలక్ష్మి, న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఏపీపీ కె శివలీల, అడిషనల్ పీపీ ఆర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో స్మార్ట్ ఇండియా హాక్‌థాన్-25 ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాదు తదితరులు

వట్టిచెరుకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కిట్స్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ 2025 సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే స్మార్ట్ ఇండియా హాక్‌థాన్‌కు జేఎన్‌టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాదు ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికత అనేది కేవలం పరిసరాల గురించి మాత్రమే కాదన్నారు. అది జీవితాన్ని మెరుగుపరచి, జీవితాలను మార్చే పరిష్కారాలను సృష్టించటానికే నన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విద్యార్థులు పరిశ్రమలను మాత్రమే కాదని, దేశాన్ని తీర్చిదిద్దే సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ వంటి కార్యక్రమాలు విద్య, పరిశ్రమల మధ్య అంతరాలను తగ్గించి యువతను నిజ జీవిత సవాళ్ళను ఎదుర్కొనేలా తయారు చేస్తాయన్నారు. కిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ, కిట్స్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ కార్యక్రమానికి ఎంపిక చేసి నిర్వహించటం హర్షణీయమన్నారు. 1300 బృందాలు, 60 నోడల్ సెంటర్లలో పాల్గొంటున్న గ్రాంట్ ఫినాలేకు కిట్స్ కళాశాల ఒక నోడల్ సెంటర్‌గా బాధ్యత తీసుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రెండు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్మార్ట్ ఇండియా హాక్‌థాన్‌లో 21 రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 150 మంది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. స్మార్ట్ ఇండియా హాక్‌థాన్ 2025 జాతీయ స్థాయి ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరై ఇచ్చిన సందేశాన్ని అక్కడున్నవారందరూ వీక్షించారు. 21 రాష్ట్రాల నుంచి పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులతో పాటు కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, సెక్రటరీ కోయ శేఖర్, ఐఐసీ హెడ్ డాక్టర్ చిట్టినేని అరుణ, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరిబాబు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, డీన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఉప కులపతిని చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు ఘనంగా సన్మానించారు.

కొండపై నుంచి పడిన బండరాయి
● తప్పిన ప్రమాదం


కొండపై నుండి దొర్లిపడిన బండరాయి

తాడేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని హరిజనవాడ కొండ వద్ద గత కొంతకాలంగా గ్రావెల్ తవ్వకాలు పగలూ, రాత్రి తేడాలేకుండా నిరాటంకంగా సాగుతున్నాయని, ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఓ పెద్ద బండరాయి స్థానిక ఇళ్లవద్ద దొర్లిపడి పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఆరోపించారు. గ్రావెల్ తవ్వకాల వల్ల గ్రామం మొత్తం దుమ్ము, ధూళి పెద్దఎత్తున లేస్తోందని, లారీల శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ పరిస్థితిని పోలీసులకు కూడా వివరించామని స్థానికులు చెప్పారు. కొండపైనుండి ఎప్పుడేం పడతాయో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామన్నారు. అదేమంటే కొందరు బెదిరిస్తున్నారని వాపోయారు. పోలీసులు, పాలకులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా
● వైసీపీ నాయకుడిపై ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ప్రాంతంలో వైసీపీ నాయకుడు శ్రీనివాస్ ప్రభుత్వ పోరంబోకు భూమిని కబ్జా చేశాడని, దీనిపైన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా సర్వేయర్ కొలతలు వేసి ఆయన ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు తేల్చారని అన్నారు. తాను రెవెన్యూ అధికారులకు ఫిర్యా దు చేశాననే కక్షతో తనను చంపుతానని బెదిరిస్తున్నాడన్నారు. ప్రభుత్వ పోరంబోకు భూమిని కబ్జాచేసిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని, అదేవిధంగా తనకు ఆయన నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

● కబ్జాపై ప్రశ్నిస్తే వైసీపీ నాయకుడి దాడి

లాల్‌పురం గ్రామంలో తన స్థలాన్ని ఆ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు కబ్జా చేశాడని, అదేమని ప్రశ్నిస్తే తన కాలు విరగొట్టాడని పట్టాభిపురంకు చెందిన ఉప్పు శంకరరావు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను 2011లో లాల్‌పురం గ్రామంలో 13 సెంట్ల భూమి కొనుగోలు చేశానని, రెండు నెలల క్రితం తన భూమిని కబ్జా చేశారన్నారు. తాను, తన కుమారుడు వెళ్లి ప్రశ్నించగా తనపై దాడి చేసి కుడికాలు విరగ్గొట్టారన్నారు.

● వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

గ్రామానికి చెందిన దస్తగిరి, కాలేషా, హసీనా, జాన్, చాంద్, షకీరా, గాలిసా.. తనను, తన కుమార్తెను చంపుతామని బెదిరిస్తున్నారని వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన షేక్ రెహానా వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

● జీతం ఇవ్వకుండా బలవంతంగా రాజీనామా

తాను పనిచేస్తున్న ఓ ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం తనకు, తన సహ ఉద్యోగులకు జీతం ఇవ్వకుండా బలవంతంగా రాజీనామా చేయించారని మంగళగిరికి చెందిన బండారు వరలక్ష్మి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనకు జీతం నిలిపేసి బలవంతంగా రాజీనామా పత్రాలపై సంతకాలు తీసుకున్నారని వరలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన


భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తాడికొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించటం ద్వారా భూమి స్వభావం తెలుస్తుందని భూసార పరీక్షల వ్యవసాయాధికారిణి కె.శ్రీరంజని పేర్కొన్నారు. సోమవారం తాడికొండ మండలం పొన్నెకల్లు జడ్పీ పాఠశాల విద్యార్థులకు సాయిల్ హెల్త్ ప్రోగ్రాంను నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంజని మాట్లాడుతూ, మట్టి నమూనా సేకరించాక 12 రకాల పారామీటర్ల ద్వారా పరిశీలించవచ్చని తెలిపారు. వివిధ పోషకాల లభ్యతను భూసార పరీక్షలు ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలన్నారు. భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాల ద్వారా పంటలను వేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్.ఎం వెంకటేశ్వర్లు, శ్రీహరి, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా దృక్పథం హర్షణీయం
● ఎంఈవో సత్యనారాయణమూర్తి


మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ మూర్తి

వట్టిచెరుకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ క్యాడర్ సేవా దృక్పథంతో చేసే కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. వీవీఐటీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని లేమల్లెపాడు గ్రామంలో వారంరోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని సోమవారం ఎంఈవో సత్యనారాయణమూర్తి, సొసైటీ చైర్‌పర్సన్ పాతూరి కృష్ణారావు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కె.శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు. ప్రత్యేక శిక్షణా శిబిరంలో స్వచ్ఛతాహి సేవ, పచ్చదనం, పరిశుభ్రత, మత్తు పదార్థాలతో అనర్థాలను గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించనున్నామని, మెడికల్ క్యాంపుతో గ్రామస్థులకు వైద్య సేవలు అందించనున్నామని వీవీఐటీయూ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ భక్తసింగ్ వివరించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం పసుపులేటి శ్రీధర్ సహకారాన్ని అందించారు.

సీఐటీయూ మహాసభల కరపత్రాలు పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మహాసభలు ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా కార్మిక వర్గం, తరలిరావాలని కోరుతూ సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం కొత్తూరు ఏరియాలో మహాసభ కోసం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూరు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో తీర్మానాలు ఉంటాయని, సీఐటీయూను బలపరచాలని కోరుతూ విశాఖ మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, జొన్నా శివశంకర్, మోదుగుల శ్రీనివాసరెడ్డి, డివి భాస్కరరెడ్డి, బొజ్జ సుబ్బారావు, యోహను, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విత్తన చట్టాన్ని ఉపసంహరించాలి
● ప్రజా సంఘాల డిమాండ్


జాతీయ రహదారిపై ప్రతులను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

తాడేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టాన్ని ఉపసంహరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌కెయం పిలుపులో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయరహదారి వద్ద సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య మాట్లాడుతూ రైతాంగానికి, వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ విత్తనచట్టం 2025ను దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలకు ద్రోహం చేసి రైతులకు వ్యతిరేకంగా ఉన్న సీడ్స్ బిల్లును తీసుకురావడం సంయుక్త కిసాన్ మోర్చా పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ చట్టం విత్తన స్వావలంబనను దెబ్బతీస్తుందన్నారు. ప్రైవేటు కంపెనీలకు దోపిడీని కొనసాగించేందుకే ఈ చట్టం తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. దీనివలన ఉత్పత్తి ఖర్చులను పెంచడమేకాక, వ్యవసాయ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన చట్టం వల్ల దేశ విత్తనరంగంపై బహుళ జాతి సంస్థల కార్పొరేట్ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి దారి తీస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివనాగరాణి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్, ఏపీ రైతుసంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు కె జగదీశ్వర్‌రెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బక్కిరెడ్డి, వీరాస్వామి, పల్లె కృష్ణ, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు విడుదల చేయాలి
● ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావలసిన రాయితీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు సోమవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని ముట్టడించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పారిశ్రామికవేత్తలు ఏపీఐఐసీ కార్యాలయం వద్ద బైటాయించి ధర్నా నిర్వహించారు. పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ ఏపీలో 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేసినప్పటికీ ఆ చట్టాన్ని నీరుగార్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులో రూ.వెయ్యి కోట్లకు పైగా రాయితీల కోసం నిధులు విడుదల చేసినప్పటికీ తమకు రాయితీలు అందలేదని పేర్కొన్నారు. 8 వేల మంది పారిశ్రామికవేత్తలు గత నాలుగేళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా స్పందించి రాయితీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జేఏసీ నాయకులు అనార్‌బాబు, రాజశేఖర్, కారెం సత్యనారాయణ, సత్య, త్రిమూర్తులు, చినమౌలాలీ, నాగకుమార్, వి.భక్తవత్సలం, నాగలక్ష్మీ, మేరీ, మరియమ్మ, నయోమి, బి.కుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా వీరాంజనేయులు

కాకుమాను, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కౌన్సిలర్‌గా లంకపల్లి వీరాంజనేయులు ఎన్నికయినట్లు సంఘ సభ్యులు సోమవారం తెలిపారు. మండల పరిధిలోని బోడిపాలెం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వీరాంజనేయులు గతంలో జిల్లా కమిటీలో కూడా పనిచేశారు. తాజాగా రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎంపిక కావడం పట్ల ఎస్టీయూ మండల నాయకులు, జిల్లా నాయకులు వీరాంజనేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే ఎస్టీయూ అభివృద్ధికి పాటు పడతానని హామీ ఇచ్చారు.

పేదల ఇళ్ళ స్థలాల ఆక్రమణ
● పీజీఆర్ఎస్‌లో ఏఎంసీ డైరెక్టర్ ఫిర్యాదు

ప్రత్తిపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారని ప్రత్తిపాడు ఏఎంసీ డైరెక్టర్ పమిడి శ్రీనివాసరావు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పూర్వం టీడీపీ హయాంలో రామానగర్ కాలనీ ఏర్పడిందని, ఆ సమయంలో పేదలకు గృహనిర్మాణం కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వగా కొన్ని ప్లాట్లు మిగిలి ఉన్నాయన్నారు. అయితే కాలక్రమంలో ఆ ప్లాట్లు పక్కనే ఉన్న పొలంలో కలిసి పోయాయన్నారు. ఇటీవల కాలంలో నూతనంగా కొన్ని వెంచర్లు అక్కడ పడటంతో వారు దీనిని కలుపుకునే ప్రయత్నంలో ఉన్నారని, అందులో భాగంగానే గ్రావెల్ కూడా తోలారని పమిడి శ్రీనివాసరావు పీజీఆర్ఎస్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పేదలకు అందాల్సిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


ఎస్ఆర్ఎంలో బుక్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

కెమికల్ బయాలజీపై అంతర్జాతీయ సదస్సు

తాడికొండ/తుళ్లూరు(నీరుకొండ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం అధ్వర్యంలో సోమవారం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కెమికల్ బయాలజీ అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. రెండురోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి పేరున్న శాస్త్రవేత్తలు, పరిశోధనా రంగనిపుణులు, స్కాలర్లు హాజరయ్యారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య సతీష్‌కుమార్ సదస్సును ప్రారంభించి శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. జీవ, రసాయనశాస్త్రాల మధ్య బలమైన బంధాన్ని ఆయన వివరించారు. ఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ స్కూల్ డీన్ డాక్టర్ సీవీ టామి వర్సిటీలోని ఇంటర్ డిసిప్లినరీ ఎంగేజ్‌మెంట్ విలువను వివరించారు. ఈ సదస్సులు శాస్త్రవేత్తల పరిశోధనా సామర్థ్యాలను పెంచేందుకు దోహదపడతాయన్నారు. వర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా జీవరసాయన శాస్త్రంలో పెరుగుతున్న పరిశోధనలు, వాటి ప్రాధాన్యాలను వివరించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ అబ్స్ట్రాక్ట్ బుక్‌ను ఆవిష్కరించారు. సదస్సులో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సభ్యసాచి చక్రవర్తి, కన్వీనర్ డాక్టర్ ఎల్లిపెల్లి సతీష్, డాక్టర్ రాజసాండ్యన్, ప్రొఫెసర్‌లు రాఘవన్ వరదరాజన్, హరినాథ్, సోను వేణుగోపాలరావు, డాక్టర్ వెంకట శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరు రూరల్ మండలాలకు చెందిన పలు ఫిర్యాదులు అందాయి. గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల పథకంలో వట్టిచెరుకూరు మండలం, కొర్నెపాడు లేఅవుట్‌లో పట్టా ఇచ్చారని, నేటికీ స్థలాలను కేటాయించలేదని స్థానిక 48వ డివిజన్ శారదా కాలనీ శివారులో నివసిస్తున్న పేదలు అర్జీ అందజేశారు. నాటి లబ్ధిదారుల జాబితా నుంచి తమ పేర్లను తొలగించి, ప్రస్తుతం అందజేస్తున్న టిడ్కో ఇళ్ల జాబితాలో చేర్చాలని విజ్ఞప్తిచేశారు. పెదనందిపాడు, నల్లమడ వాగు కరకట్ట వద్ద నివసించే పేదలకు ఇళ్ల స్థలాలు, ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు పాశం రామారావు, బైరగాని శ్రీనివాసరావు అర్జీ అందజేశారు. మట్టిని అక్రమంగా అమ్ముకున్న సర్పంచ్, పంచాయితీకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని తాడికొండ మండలం లాం గ్రామంలోని 6,7వ వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఆరు నెలల క్రితం డ్రెయిన్ల నిర్మాణానికి గుంతలు తీసి నేటివరకు నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిపై ప్రశ్నిస్తే సర్పంచ్, కార్యదర్శి భౌతికదాడులకు దిగుతున్నారని వాపోయారు. జాన్‌సైదా, బాజీ, సుభాని, షేక్ సైదా, మాబు సుభాని తదితరులు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణంతో మురుగునీరు ఇళ్ల వద్దకు చేరుతోందని గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు అర్జీ అందజేశారు. ఈ నిర్మాణంపై గతంలో ఫిర్యాదు చేసినా పరిష్కరించకుండానే అర్జీని మూసేశారన్నారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ రాష్ట్ర నాయకులు

దుగ్గిరాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని బీసీ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్రనాయకులను సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఫీజు బకాయిల అంశంపై ధర్నా చేస్తున్న వైసీపీ విద్యార్థివిభాగం రాష్ట్రనాయకులు పానుగంటి చైతన్య, ఎం. నరేంద్రరెడ్డి, పి. నవీన్‌కుమార్, జీ. రవీంద్ర, ఏ. రవిచంద్రలను శాంతిభద్రతల దృష్ట్యా, అరెస్టుచేసి 30మంది ప్రత్యేకబలగాలతో దుగ్గిరాల స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి వారిని కలిసి మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం అరెస్టు చేసిన వారిని ప్రత్యేకవ్యాన్‌లో, రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్సై వెంకటరవి తదితరులు తాడేపల్లికి తరలించారు.

వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మంగళగిరి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పువ్వాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వి.పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా గోలి బాలమోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా డోకుపర్తి నరేంద్ర, దర్నాసి వెంకట రమణ, కోశాధికారిగా తిరువీధుల నరసింహమూర్తి, మరో 12మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు కేటాయింపు

తుళ్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులోని రామలింగేశ్వర స్వామి, వీరభద్రస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించారు. రామలింగేశ్వరస్వామి ఆలయానికి దేవదాయ శాఖ రూ.2కోట్ల అంచనాలు, ప్లాన్లు ఆమోదించింది. ఈ నిధుల్లో దేవదాయ శాఖ సీజీఎఫ్ నుంచి రూ.1.33 కోట్లు గ్రాంట్‌గా ఇచ్చినట్టు ఈవో గోపి సోమవారం ప్రకటనలో తెలిపారు. వీరభద్రస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.1.80 కోట్లతో అంచనాలు, ప్లాన్లు ఆమోదం తెలపగా అందులో 1కోటి 20లక్షలు దేవదాయ శాఖ గ్రాంట్‌గా ఇచ్చిందన్నారు. ఆలయాల పునర్నిర్మాణానికి గ్రామ ప్రజలందరూ సహకారం అందించాలని ఈవో కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఫిరంగిపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నుదురుపాడు, కండ్రిక, బేతపూడి, గుండాలపాడు, ఎర్రగుంట్లపాడు, పొనుగుపాడు, మునగపాడు, మేరికపూడి గ్రామాలకు ఈ నెల 9న మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గా ప్రసాదు తెలిపారు. అసౌకర్యానికి గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఎంపీఎల్-4 టోర్నమెంటు డ్రా

మంగళగిరి సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రీమియర్ లీగ్ నాల్గవ సీజన్‌కు సంబంధించి క్రీడా మైదానం, ప్రారంభ తేదీ, జట్ల వివరాలను మంగళవారం వెల్లడించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మధ్యాహ్నం 3గంటలకు పోటీల వివరాలు, జట్లకు సంబంధించి డ్రా జరుగుతుందని, ఎంపీఎల్-4లో పేర్లు నమోదు చేసుకున్న జట్ల సభ్యులతోపాటు క్రీడాభిమానులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

తుళ్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వీఐటీ - ఏపీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శాఖమూరు, ఐనవోలు, వెలగపూడి గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పరికరాలను సోమవారం అందజేశారు. వీఐటీ ఛాన్సలర్, ఫౌండర్ విశ్వనాథన్ జన్మదిన వేడుకలలో భాగంగా విద్యార్థులకు విద్యకు సంబంధించిన పుస్తకాలు, క్రీడా వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ వైస్ చాన్సలర్ ఇన్‌చార్జ్ ఆర్మగం వర్మ, రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి పాల్గొన్నారు. వీఐటీ దత్తత గ్రామాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

అది జగన్ దురహంకారానికి నిదర్శనం: కొల్లా

కాకుమాను, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై జగన్ దూషణలకు పాల్పడడం ఆయన దురహంకారానికి నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవణ్‌కల్యాణ్‌ను జైలులో పెట్టాలని, చంద్రబాబును తన్నాలని జగన్ తూలనాడడం ఆయన నీచ, అరాచక ఉన్మాద మనస్తత్వానికి నిదర్శనమని కొల్లా దుయ్యబట్టారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మున్సిపల్ గ్రీవెన్స్‌కు ఒక అర్జీ

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఒకే అర్జీ వచ్చింది. చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో మొక్కలు పెంచేందుకు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంపై విచారించాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 2, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, పౌర సరఫరాల శాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు అందించారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు మూడు దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. పెదరావూరులో ఇంటి స్థలం సర్వే, కొలివరంలో వృద్ధాప్యంలో బిడ్డలు చూడటం లేదని, మూత్ర పిండాల ట్రాన్స్‌ప్లాంటేషన్ అనుమతి కోరుతూ దరఖాస్తులు అందించారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరులో నాలుగు అర్జీలు

పొన్నూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ రెవెన్యూ సంబంధిత సమస్యలు 2, వ్యవసాయ శాఖకు సంబంధించి 1, స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధించి 1 అర్జీ అందాయి. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల పేద విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు 9న, మంగళవారం పంపిణీ చేస్తామని బోసురోడ్డులోని కాకుమాను శంకరుని ధర్మసత్రం ధర్మకర్త కాకుమాను శరత్ బాబు తెలిపారు. 200మంది విద్యార్థులకు రూ.5.25 లక్షలు పంపిణీ చేయడంతో పాటు పేదలకు అన్నదానం, గోవాడ గోశాలకు రూ.3లక్షలు అందజేయనున్నట్లు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కాకుమాను శంకరుని 109వ వర్ధంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తెనాలి పట్టణంతో పాటు మండలంలోని పేద విద్యార్థులు 5, 6, 7 తరగతుల వారికి రూ.2 వేలు చొప్పున 100మందికి, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.3వేలు చొప్పున 75 మందికి, మరో 25మంది పేద విద్యార్థులకు రూ.4వేలు చొప్పున అందజేస్తామన్నారు.

చలికాలంలో ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరం

● డాక్టర్ వేముల ప్రియాంక

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తత అవసరమని డాక్టర్ వేముల ప్రియాంక తెలిపారు. నందులపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వార్డులలో పర్యటించేటప్పుడు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వైరల్ జ్వరాలు, చర్మం పొడిబారడం, ఆస్తమా వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. పొడిబారిన చర్మానికి మాయిశ్చర్ క్రీములు వినియోగించాలని, దాహం వేయకపోయినప్పటికీ తగినంత నీరు తాగాలని, గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలన్నారు. సమావేశంలో బాలచంద్రమౌళి, ఉమాకాంత్, పుష్పలత పాల్గొన్నారు.

50 పడకల కేటాయింపుపై హర్షం

పొన్నూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి 50 పడకల కేటాయింపు హర్షణీయం అని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మగ్బుల్‌బేగ్ అన్నారు. స్థానిక షాదీఖానాలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు- నిడుబ్రోలులోని ప్రభుత్వ వైద్యశాలను 30నుంచి 50పడకలకు అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కృషితో ఎన్నో ఏళ్లకలను సహకారం చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వైద్యశాలను 50 పడకలకు పెంచటానికి సుమారు 5కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యశాలలో డాక్టర్ల సంఖ్య పెరగటంతో పాటు ఓపీ సేవలు కూడా రెట్టింపవుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిధుల అవినీతిపై కూడా దర్యాప్తు జరపాలని కోరారు. అలాగే 50పడకల ఆసుపత్రికి వచ్చే రోగులకు భోజన వసతి కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, అధికార ప్రతినిధి షేక్ బాజీసాహెబ్, షేక్ బాబ్జి, షేక్ హుస్సేన్, షేక్ బాబు పాల్గొన్నారు.

పెంచిన ఫిట్‌నెస్ చార్జీలు తగ్గించాలి: శివాజీ

పెదకాకాని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రవాణా రంగంపై పెంచిన ఫిట్‌నెస్ చార్జీలను తక్షణమే తగ్గించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొల్లికొండ ఏడుకొండలు అధ్యక్షతన రవాణా కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో మోడల్ తక్కువ వాహనాలకు ఫిట్‌నెస్ చార్జీలు పెంచిందని వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇన్సూరెన్స్ ప్రీమియం అన్నిరకాల ఫీజులు పెనాల్టీలు పెరిగి రవాణారంగం సంక్షోభంలో ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, యాకోబు, డి.వెంకటరెడ్డి, షేక్ ఇస్మాయిల్, షేక్ బికారి, సాహెబ్, ఉల్లంగుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎడాపెడా చెట్ల నరికివేత

● లోపిస్తున్న పర్యావరణ స్పృహ



కొత్తపేటలో నరికివేసిన చెట్టు కొమ్మలు

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాలలో ఏపుగా పెరిగిన చెట్లను ఎడాపెడా నరికి వేస్తున్నారు. పర్యావరణం నానాటికీ ప్రపంచ వ్యాప్తంగా క్షీణిస్తూ ఆ ప్రభావం అందరికి తెలుస్తున్నప్పటికీ పర్యావరణ స్పృహ లోపించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణం పేరుతో గత కొన్నేళ్లుగా పట్టణంలో రహదారుల వెంట విరివిగా మొక్కలు నాటి రక్షణకు ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. అవి పెరిగి పెద్దవి కావడంతో కొన్నిచోట్ల ఇళ్ల యజమానులు తమకు అడ్డం వచ్చాయని, దుకాణాలు కనబడటం లేదని, రహదారి విస్తరణ పేరుతో చెట్లను తొలగిస్తున్నారు. తూర్పు కాల్వ వెంబడి దుకాణాలు పెట్టి ఆక్రమించేందుకు చెట్లు కొట్టివేస్తున్నా కూడా మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు. పర్యావరణ దినోత్సవాల్లో పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ సుద్దులు చెప్పే అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెంచిన చెట్లను కొట్టి వేస్తుంటే ఏం చేస్తున్నారని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో ఎక్కడ ఏం జరుగుతున్న టౌన్ ప్లానింగ్, నగర దీపికలు, పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది దృష్టికి తప్పకుండా వస్తుంది. కానీ, పట్టించుకోవాలన్న ధ్యాస లేకపోవడంతో చెట్లను విచక్షణారహితంగా కొట్టి వేస్తున్నారు. ఎక్కడైనా ఒక చెట్టు కొట్టి వేసి ఉంటే ఆ పని ఎవరు చేశారో తెలుసుకుని చర్యలు చేపట్టడంతో పాటు ఆ సమాచారం అందరికి తెలిసేలా చేస్తే చెట్లను కొట్టడానికి కాస్తంత ఆలోచిస్తారని పట్టణ ప్రజలు సూచిస్తున్నారు. మున్సిపల్ అధికారులు పెరిగిన చెట్లను కొట్టకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్, డీఎస్పీ

మున్సిపల్ ఆస్తుల రక్షణపై సమీక్ష

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ ఆస్తులను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పోలీసులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇటీవల మున్సిపల్ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడుతూ ప్రశ్నించిన టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై దాడి నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. పట్టణంలోని ఖాళీ స్థలాలు, పాఠశాల భవనాలు, వాణిజ్య సంస్థలు, కమ్యూనిటీ హాల్స్, పార్కులు, శ్మశాన వాటికలు, వాటర్ ట్యాంకు ప్రదేశాలు, డంపింగ్ యార్డు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రభుత్వ స్థలాలను కాపాడుకునేందుకు వాటిని సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన ప్రభుత్వ కార్యకలాపాలు వినియోగించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ క్రమంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే ఆయా వార్డుల్లోని కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అధికారుల దృష్టికి తేవాలన్నారు. మున్సిపల్ ఆస్తులను ఆదాయం వచ్చే రీతిలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ జనార్దనరావు, సీఐలు రాములునాయక్, మల్లికార్జునరావు, ఏసీపీ వాణి పాల్గొన్నారు.

అధికారులు సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

చేబ్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హెచ్చరించారు. గుంటూరు జిల్లా చేబ్రోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే, అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యల తీవ్రతను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు స్పందిస్తున్న తీరుపై ధూళిపాళ్ల నరేంద్ర తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అధికారులను ఆదేశించారు. గత పాలకుల మాదిరిగా ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం కూటమి ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రథమ అజెండా అని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమానికి వచ్చిన వికలాంగుల వద్దకు వెళ్ళి వారి సమస్యలను ఎమ్మెల్యే సానుకూలంగా ఆలకించారు. వారి నుంచి అర్జీలు స్వీకరించి, తక్షణమే వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతూ, ఆసుపత్రి ఖర్చులకోసం ఇబ్బంది పడుతున్న ఓ బాధితుడు తనకు సాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ధూళిపాళ్ల సదరు వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు కోసం వెంటనే సిఫార్సు చేయాలని పార్టీ వర్గాలను ఆదేశించారు. త్వరలోనే బాధితుడికి ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలపై ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని, ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మండల కూటమి పార్టీల నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వికలాంగుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే

చేబ్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శేకూరులోని ఆర్ఎస్‌కే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సందర్శించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం శాంపిల్స్ ఎలా తీసుకుంటున్నారు, నాణ్యతా ప్రమాణాలు ఎలా పరీక్షిస్తున్నారు, బిల్లుల చెల్లింపులు ఏ విధంగా జరుగుతున్నాయి వంటి అంశాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ముఖ్యంగా ధాన్యాన్ని పరిశీలిస్తూ రైతులతో మాట్లాడిన ఆయన తక్కువ రేటుకు ధాన్యం అమ్ముకోవద్దని, తేమ శాతాన్ని పరిశీలించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో అమ్మితే ఒక్క బస్తాకు రూ.1700 నేరుగా రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటికే 75మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి దాదాపు రూ. 1కోటి 64 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ పరిస్థితులపై మాట్లాడుతూ, బయట మార్కెట్‌లో రైతులు బస్తాకు రూ.1400కే అమ్ముకోవాల్సి వస్తుందని, కానీ ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం తగిన మద్దతు ధర ఇవ్వడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 17శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని చూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వమే రైతుల ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తుందని తెలిపారు.



బాలికకు సైకిల్ అందజేస్తున్న తహసీల్దార్

బాలికకు సైకిల్ అందజేత

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేట ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్‌లో జరుగుతున్న దుర్గా అనే విద్యార్థికి సోమవారం సైకిల్ అందజేశారు. కొలివరం నుంచి చదువుకోవడానికి తెనాలి వస్తోంది. బాలిక ఆర్థిక పరిస్థితి గమనించి తహసీల్దార్ గోపాలకృష్ణ, భువన సహకారంతో సైకిల్‌ను బాలికకు అందించారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, రూరల్ సీఐ ఆనంద్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి

● మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు ఎన్ఏటీఎస్ సభ్యులు

చేబ్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విదార్థులు ఉన్నత లక్ష్యాలతో సాగాలని మాజీ శాసనమండలి సభ్యుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.లక్ష్మణరావు విద్యార్థులకు సూచించారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ (ఎన్ఏటీఎస్) సహకారంతో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎన్ఏటీఎస్ ప్రతినిధులు ఎన్ఎంఎంఎస్, ఐఏఎస్ ఓరియెంటేషన్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనమండలి సభ్యుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.లక్ష్మణరావు హాజరయ్యారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని, కష్టపడి చదివి సివిల్ సర్వీసులకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. ఎన్ఏటీఎస్ ఛైర్మన్ పిన్నమనేని ప్రశాంత్ మాట్లాడుతూ తాము ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నామని, మాతృభూమికి రుణం తీర్చుకునేందుకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 26,500 మంది విద్యార్థులకు ఎన్ఏటీఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను గుర్తించిన లక్ష్మణరావు పాఠశాలలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.25,000 ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు యం.ఏడుకొండలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఏటీఎస్ ప్రతినిధులు ఎం. శ్రీహరి (ప్రెసిడెంట్), ఎం.కిరణ్, ఎం.వెంకట్, చైతన్య, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ వి.గోపీనాథ్, ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, డీవీ శ్రీనివాస్, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

తహసీల్దార్ సిద్ధార్థ



కొల్లిపరలో రేషన్ షాపులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగినా సంబంధిత డీలరుపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో రేషన్‌షాపులను ఆయన తనిఖీచేశారు. నిత్యావసర సరుకుల పంపిణీపై డీలర్లకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భగా సిద్ధార్థ మాట్లాడుతూ డీలర్లు రేషన్ పంపిణీ విషయంలో ఫిర్యాదులు రాకుండా చూచుకోవాలన్నారు. చౌక డిపో డీలర్లు నిత్యావసరాల పంపిణీ విషయంలో తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. రేషన్ కార్డుదారులు కూడా డీలర్లుకు సహకరించాలన్నారు. బియ్యం, పంచదార వంటి నిత్యావసర సరుకులను రేషన్‌కార్డు దారులు డీలర్ల వద్దనే తీసుకోవాలన్నారు. తనిఖీలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెల తాను, తన భార్య పొన్నూరు నుంచి గుంటూరుకు ఆర్టీసీ బస్సులో వచ్చిన సమయంలో తమ పర్సు నుంచి బంగారు ఆభరణాలు కొట్టేశారని వారిపై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పొన్నూరు మండలం ఇటికంపాడుకు చెందిన రమేష్‌బాబు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. టీడీపీ కార్పొరేటర్ పోతురాజు సమతతో కలిసి ఆయన ఎస్పీని కలిసి చోరీ కేసు గురించి వివరించారు. తాము గత నెల 14న హైదరాబాద్ వెళ్లేందుకు పొన్నూరు నుంచి ఆర్టీసీ బస్సులో గుంటూరు వచ్చామన్నారు. బీఆర్ స్టేడియం వద్ద బస్సు దిగి ఆటోలో రైల్వే స్టేషన్‌కు వెళ్లామన్నారు రైల్వేస్టేషన్లో బ్యాగు చూసుకోగా అందులోని పర్సులోని 12 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదన్నారు. వెంటనే పాత గుంటూరు స్టేషన్‌కు వెళ్ళగా వారు కొత్తపేట వెళ్లాలని చెప్పడంతో కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసామన్నారు. ఆ తర్వాత రోజు తాము పోలీసులు చూపిన ఫొటోలను చూసి దొంగలను గుర్తుపట్టామన్నారు. స్టువర్టుపురంనకు చెందిన నలుగురు మహిళలు బస్సులో తమతోపాటు ప్రయాణించారన్నారు. ఆ సమయంలోనే ఆ మహిళల దొంగల ముఠా బంగారు ఆభరణాలు కొట్టేశారన్నారు. ఈ ముఠాపై చర్యలు తీసుకొని బంగారం రికవరీ చేయాలని బాధితుడు రమేష్ బాబు ఎస్పీకి ఫిర్యాదుచేశారు. తగిన న్యాయం చేయాలని కొత్తపేట పోలీసులను ఎస్పీని ఆదేశించారు.



ప్రచారంలో పాల్గొన్న సీఐటీయూ మహిళా నేతలు

లేబర్ కోడ్స్ రద్దుతో కార్మికులకు తీవ్ర నష్టం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

తెనాలి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయడం వలన కార్మిక లోకంకు తీవ్రమైన నష్టం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం నందివెలుగులో ఇంటింటి ప్రచారంలో భాగంగా విశాఖలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, కార్మిక సమస్యలు పరిష్కారం కోసం విశాఖ వేదికగా ఈ నెల 31 జనవరి 4 వరకు జరిగే మహాసభలలో కార్మికులు చర్చలు జరిపి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఈ మహాసభలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎవిఎన్ కుమారి, విమల, నాగజ్యోతి, కళ్యాణి, నవ్య, రాజకుమారి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరపేటలో దొంగల భయం

● పట్టించుకోని పోలీసులు

తెనాలి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరపేటలో స్థానికులకు దొంగల భయం వెంటాడుతుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతున్నా పోలీసులు ఇటు వైపు తొంగి చూడటం లేదని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. పట్టణ శివారు కావడంతో మత్తు గ్యాంగ్‌ల ఆగడాలు నెలల తరబడి కొనసాగుతున్నాయి. స్థానికుడైన గోపరాజు ఇంటి నిర్మాణం చేస్తుండగా ఆదివారం ఉన్న ఆ ఇంటి వైరింగ్ సుమారు రూ.1.50 లక్షల విలువైన విద్యుత్ వైర్లు మోటారు, ఇతర సామగ్రి అపహరించారు. అంతకుముందు ఇదే ప్రాంతంలో రెండు ఇళ్లలో ఇదేవిధంగా దొంగతనాలు జరిగాయి. రెండు నెలల క్రితం ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు నగలు లాగేసుకున్నారు. సాయంత్రం అయితే ఇక్కడ శివారు ప్రాంతం, ఖాళీ స్థలాలలో యువకులు గుంపులుగా చేరి మత్తు పదార్థాలు సేవిస్తున్నా, పోలీసుల నిఘా ఈ ప్రాంతంలో కరువైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలా సంఘటనలు పోలీసులకు తెలిసి జరుగుతున్నా ఇవి సర్వసాధారణమంటూ వారు ఉపేక్షిస్తున్నారని, వెంటనే ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు

● చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్గనైజర్ అక్కయ్య

పొన్నూరు టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్గనైజర్ డి.అక్కయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని నండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ సోమవారం భారత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మనోరమ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు వివాహం చేయకూడదని వివాహం చేయడంవల్ల వారు శారీరకంగానూ, మానసికంగానూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సమాచారం తెలిస్తే దగ్గర్లో ఉన్న పంచాయతీ కార్యాలయంలో గాని, మహిళా పోలీస్ కాని, ప్రధానోపాధ్యాయులకు గాని, చైల్డ్ హెల్ప్ లైన్ నెం.1098 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాఫ్ సంస్థ ప్రతినిధులు పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కార్యదర్శి బాంధవి

పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులు, యువతదే

● కొడాలి వీరయ్య ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రియబాంధవి

తెనాలి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందని కొడాలి వీరయ్య ఎడ్యుకేషన్ కార్యదర్శి వాసిరెడ్డి ప్రియబాంధవి చెప్పారు. దివంగత మాజీ ఎమ్మెల్యే కొడాలి వీరయ్య 25వ జయంతి పురస్కరించుకుని మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పోటీలు నిర్వహించారు. పర్యావరణం, పరిరక్షణ - నా బాధ్యత అనే అంశంపై విద్యార్థులు వక్తృత్వం పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంపికచేసి అభినందించారు. ఈ నెల 10న ఐఎంఏలో జరగనున్న కార్యక్రమంలో బహుమతులు అందిస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని, మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, వసంత లక్ష్మి, శ్రీదేవి, మహేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

చేబ్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం శలపాడులోని ద్రాక్షావల్లి ప్రార్థన మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఏసుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, పాస్టర్లు, అనేక మంది పాల్గొన్నారు. పాస్టర్ మోషే, పాస్టర్ కే.లాభాను, పాస్టర్ సాలెంరాజు తదితరులు సందేశాలు అందించారు. ఈ సందర్భంగా సుమారు 500మందికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

విత్తన చట్టాన్ని ఉపసంహరించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల హక్కులను అణగదొక్కి, ఆహార భద్రతను నాశనంచేసే 2025 విత్తన చట్టాన్ని ఉపసంహరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అత్తోట యాదవపాలెంలో ఏపీ రైతు సంఘం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ భారత విత్తనరంగంపై బహుళ జాతి సంస్థలు కార్పొరేట్ ఆధిపత్యం నెలకొల్పుకోవడానికి తీసుకొచ్చిన ప్రతికూల చట్టం అన్నారు. పంటలను సంస్థల మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని దీనిని వ్యతిరేకిస్తూ రైతులు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు డి.నాగపుణ్యేశ్వరరావు, టి.బసవశంకరరావు, వి.నాగేశ్వరరావు, డి.వినయ బుచ్చయ్య, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.